


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ఖమ్మం

5 మంగళవారం, 22 అక్టోబరు 2024

అర్హులందరికీ రుణమాఫీ

డి.పుల్లయ్య, ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి

ఫేస్ టు ఫేస్



ప్రశ్న: రైతు రుణమాఫీ కార్యక్రమం ఎంతవరకు వచ్చింది?

జవాబు: రుణమాఫీని పకడ్బందీగా అమలుచేస్తున్నాం. 1,15,183 మంది రైతులకు రూ.766.68 కోట్లు రూ.2లక్షల లోపు వరకు రుణమాఫీ చేశాం.

ప్ర: చాలామంది రైతులు రుణమాఫీ కాలేదని ఫిర్యాదులు చేస్తున్నారు.. పరిశీలించారా?

జ: జిల్లాలో 55,874మంది రైతులు రుణమాఫీ అర్హత ఉండి రాలేదని ఫిర్యాదు చేశారు. రేషన్‌కార్డు లేకపోవడంతో కుటుంబాల గుర్తింపులేక వీరికి రుణమాఫీ జరగలేదు. ఏఈవోలు, ఏవోల ద్వారా 42,456మంది అర్హత ఉండి, రుణమాఫీ కానివారిని గుర్తించాం. ఇంకా 13,418మందిని గుర్తించాల్సి ఉంది. వీరు ఇతర దేశాల్లో ఉన్నందున రాలేకపోయారు.

ప్ర: కుటుంబాల నిర్ధారణకు గడువు ఎప్పటివరకు?

జ: ప్రస్తుతం శనివారంతో కుటుంబాల నిర్ధారణ ముగిసింది. యాప్ కార్యకలాపాలు నిలిపారు. మళ్లీ ప్రభుత్వం అనుమతి ఇస్తే మిగిలిన వారు కూడా అందుబాటులోకి వస్తే వారి కుటుంబాలను గుర్తిస్తాం.

ప్ర: రూ.2 లక్షల పైబడి ఉన్న వారికి రుణమాఫీ ఎప్పుడు జరగనుంది?

జ: రూ.2 లక్షల కంటే అధికంగా బకాయిలున్న వారి రుణమాఫీపై ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు అనుసంధానం ఉన్న కుటుంబాలు గుర్తించి జాబితా విడుదల చేయనుంది. ఆ తర్వాత రేషన్‌కార్డు లేని కుటుంబాలను సర్వే ద్వారా గుర్తిస్తాం.

ప్ర: జిల్లాలో కొన్ని సొసైటీల్లో అర్హత ఉండి కూడా రైతులకు రూ.2లక్షల లోపు రుణాలు మాఫీకాలేదని అంటున్నారు?

జ: ఖమ్మంలోని టేకులపల్లి ఆంధ్రాబ్యాంకు సొసైటీకి సంబంధించి 1192మంది రైతులకు రూ.11కోట్ల మేర రుణాలు ఆడిట్ సమస్య వల్ల రుణమాఫీ కాలేదు.ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

మద్యం తాగించి.. కొట్టి చంపారు..

- చేతబడి అనుమానంతో దారుణ హత్య
- జూలూరుపాడు మండలంలో ఘటన
- సొంత బాబాయిని హతమార్చిన వ్యక్తి
- తన కుటుంబ సభ్యుల అనారోగ్యానికి కారణమని అనుమానం

7



కొత్తగూడెంలో మహాసభలో అభివాదం చేస్తున్న దృశ్యం

అభివాదం చేస్తున్న బృందాకరత్

మహిళా శక్తి వర్ధిల్లాలి

- కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం
- సీపీఎం జాతీయ నాయకురాలు బృందాకరత్
- కొత్తగూడెంలో హోరెత్తిన ఐద్వా నాలుగో రాష్ట్ర మహాసభలు
- గిరిజన కళారూపాలతో ఆకట్టుకున్న ర్యాలీ

సమాజంలో మహిళలకు అడుగడుగునా అన్యాయమే.. పెరుగుతున్న లైంగిక దాడులు

కొత్తగూడెం/మణుగూరు టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి వర్ధిల్లాలని సీపీఎం జాతీయ నాయకురాలు, రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకరత్ ఆకాంక్షించారు. సమాజంలో తమకు జరుగుతున్న అన్యాయాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మహిళలు అడుగడుగునా అన్యాయానికి గురవుతున్నారని, మహిళలకు రక్షణ కరువైందని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. కొత్తగూడెంలో సోమవారం జరిగిన ఐద్వా నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో బృందాకరత్ మాట్లాడుతూ మహిళలు పెట్టుబడిదారీ విధానాలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో ఆర్‌ఎస్ఎస్ నాయకత్వంలో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న త్రిశూల్ విధానాలను ప్రతిఘటించాలన్నారు. దేశంలో 1 శాతం ఉన్న కార్పొరేట్ అధిపతులు 40 శాతం సంపదను శాసిస్తుండడంతో ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయన్నారు. పాలకులు కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తూ మహిళల హక్కులపై ముప్పేటదాడి చేస్తున్నారని ఆరోపించారు. మహిళలు ప్రజాస్వామిక హక్కులకోసం పోరాటాలు కొనసాగించాలన్నారు. సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు (మిగతా 6వ పేజీలో)

కదం తొక్కిన మహిళా లోకం

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర నాల్గొవ మహాసభల సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో పాత బస్సు డిపో నుంచి సూర్యోదయ ప్యాలెస్ వరకు మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. వేలాది మంది మహిళలు ఐద్వా జెండాలను చేబూని మహిళలకు సమానత్వం కల్పించాలి, చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి, ధరలు, మద్యపానం నియంత్రించాలి, ప్రభుత్వ విద్యా, వైద్యం పటిష్ఠంగా అమలు చేయాలి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి, జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, జాతీయ ఉపాధ్యక్షురాలు సుధాసుందర రామన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ, అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు టి జ్యోతి, బుగ్గవీటి సరళ, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సీతాలక్ష్మి, ఎం.జ్యోతి తదితరులు ప్రదర్శన అగ్రభాగంలో నడిచారు.



కొత్తగూడెంలో ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

అదుపు తప్పి.. సాగర్ కాల్వలో పడి..

- ట్రాక్టర్ ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- కొణిజర్ల మండలంలో ఘటన



కాల్వలో పడిన ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

సైదులు భీమ్‌దేవ్

కొణిజర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో సోమవారం రాత్రి ఓ ట్రాక్టర్ అదుపుతప్పి సాగర్ కాల్వలో పడిపోవడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. కొణిజర్ల ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలంలోని శాంతినగర్ ఎస్టీ కాలనీకి చెందిన భూక్యా సైదులు(50), బానోతు భీమ్‌దేవ్(45) ఇద్దరు కలిసి రఘునాథపాలెం మండలం చింతగుర్తికి ట్రాక్టర్‌పై వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో తనికెళ్ల-బోడియాతండా మధ్య గల నాగార్జున సాగర్ ప్రధాన కాల్వ బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి కాల్వలో పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న సైదులు, భీమ్‌దేవ్‌లు ట్రాక్టర్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్టర్ యాజమాని, డ్రైవర్ అయిన సైదులు చింతగుర్తిలోని తన కూతురు ఇంటి వద్ద ఉన్న ఇనుప చువ్వలు తీసుకొచ్చేందుకు భీమ్‌దేవ్‌తో కలిసి వెళ్లాడు. తరువాత ఇంటికి బయలుదేరగా రాత్రి పొద్దుపోవడంతో ఇప్పుడు వెళ్లవద్దని సైదులు కూతురు, అల్లుడు చెప్పడంతో తిరిగి ట్రాక్టర్‌తో వారి ఇంటికే వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ కాల్వలో పడిపోయిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బోడియాతండా, తనికెళ్ల నుంచి అధికసంఖ్యలో స్థానికులు చేరుకుని ట్రాక్టర్‌ను బయటికి తీసేందుకు పోలీసులకు సహకరించారు. ఎట్టకేలకు మృతదేహాలను బయటకు తీశారు. సైదులుకు భార్య అచ్చమ్మ, కూతుర్లు ఉమ, రేణుక, తిరపతమ్మలు ఉన్నారు. భీమ్‌దేవ్‌కు భార్య లక్ష్మీ, కుమారుడు గోపి, కూతురు త్రిష ఉన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్‌లు సందర్శించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసెస్‌మెంట్ల అక్రమాలపై విచారణ జరపండి...

- కేఎంసీకి విజిలెన్స్ డైరెక్టరేట్ నుంచి లేఖ
- అక్రమార్కుల్లో వణుకు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో కొందరు అధికారులు వందలాది ఖాళీ స్థలాలతోపాటుగా, ప్రభుత్వ భూములకు, ఎకరాల్లో ఉన్న స్థలాలకు, పేరు మార్పుకు కూడా వీలుపడని అసైన్‌మెంట్ భూముల్లో ఇళ్లకు అసెస్‌మెంట్లు వేసి దర్జాగా ఇంటి నెంబర్లు కేటాయించారు. అందుకోసం ఒక్కో అసెస్‌మెంట్‌కు రూ. లక్ష వరకు మామూళ్లు తీసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారాన్ని గత ఏడాది ఆగస్టు 13న ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాల ఆధారంగా అక్రమాలపై విచారణ జరపాలని డెరెక్టర్ ఆఫ్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డైరెక్టర్ నుంచి సోమవారం ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయ అధికారులకు లేఖ అందింది. అసెస్‌మెంట్లలో అక్రమాలు వెలుగులోకి రాకముందు పనిచేసి ప్రస్తుతం జిల్లాలోని మరో పట్టణంలో పనిచేస్తున్న అధికారి, పక్క సెక్షన్‌కు మార్చిన మరో అధికారి, ప్రస్తుతం అందులోనే కొనసాగుతున్న అధికారి పేర్లను ప్రస్తావిస్తూ, ఓ బిల్ కలెక్టర్ పేరును కూడా సంబంధిత లేఖలో పేర్కొన్నట్టు తెలిసింది. కాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ పంపిన లేఖతో అక్రమార్కుల్లో వణుకు మొదలైనట్టు తెలుస్తోంది.

పత్తి రైతులు మద్దతు ధర పొందాలి

- నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండేలా చూసుకోవాలి
- ప్రైవేటు వ్యాపారులు కూడా సరైన ధరకు కొనుగోలు చేయాలి
- లాభసాటి పంటలపై రైతులు దృష్టిసారించాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- గుర్రాలపాడులో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్/ఖమ్మం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పత్తి రైతులకు మద్దతు ధర అందించేలా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని రైతులు పత్తిపంటను తేమలేకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తేవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఖమ్మంరూరల్ మండలం గుర్రాలపాడు జిన్నింగ్‌మిల్లులో సోమవారం అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసిమంత్రి తుమ్మల పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి బసవయ్య అనే రైతును పలకరించి 'పత్తి ఎంత సాగుచేశారు. దిగుబడి ఎలా వచ్చింది?' అని ప్రశ్నించగా, 'నాలుగు ఎకరాల్లో పత్తి వేశాను.. ఎకరానికి ఐదు క్వింటాళ్ల వరకే దిగుబడి వచ్చింది.. వర్షాలతో దెబ్బతిన్నది..' అని రైతు బదులిచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలపైనే కాకుండా లాభసాటి పంటల సాగుపై దృష్టిసారించాలని, అప్పుడే ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పత్తిరైతులకు మద్దతు ధర అందేలా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని స్పష్టంచేశారు. వాతావరణ పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో అధికవర్షాలతో పత్తి దిగుబడులు తగ్గాయని, పత్తి పంటలో తేమలేకుండా కొనుగోలు కేంద్రానికి తెచ్చి మద్దతు ధర పొందాలని, సీసీఐ కొనుగోలు కేంద్రంలో రైతులకు లభిస్తున్న మద్దతు ధరతో పాటు తూకాల విషయంలో ఎప్పటికప్పుడు పరిశీలన జరపాలని సూచించారు.

రెవెన్యూ, పోలీసు, మార్కెటింగ్‌శాఖ అధికారులు సమన్వయంతో పత్తి కొనుగోళ్లపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రైవేటు వ్యాపారులు కూడా మద్దతు ధరకంటే అధిక ధర ఇచ్చి పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. పత్తి, మిర్చి వంటి సాంప్రదాయ పంటలే కాకుండా ఆయిల్‌పామ్ సాగు దిశగా రైతులు దృష్టిసారించాలని, ప్రకృతి వైపరీత్యాల ఇబ్బందులుండవని, మార్కెటింగ్ సమస్య కూడా ఉండదని, రైతుకు భరోసాగా ఉంటుందని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ వర్షాలతో పత్తిలో తేమశాతం అధికంగా ఉందని, రైతులు ఆరబెట్టి సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. జిల్లాలో 9 జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతులకు మద్దతు ధరపై సలహాలు, సూచనలపై కరపత్రాన్ని మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు, ఆర్డీవో గణేష్, జిల్లా వ్యవసాయధికారి పుల్లయ్య మార్కెటింగ్ శాఖ అధికారి అలీమ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- శాంతిభద్రతలకు వారి సేవలే కీలకం : కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం .. ఉప్పొంగిన ఉద్వేగం

ఖమ్మం బైపాస్‌రోడ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):శాంతి సమాజ స్థాపన కోసం అమరులైన పోలీసుల త్యాగాల ఫలితంగానే దేశప్రగతికి బాటలు వేసిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఖమ్మం నగరంలోని పోలీసుపరేడ్ మైదానంలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా నివాళులర్పించింది. అదేవిధంగా అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు.


ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ పోలీసుల అమరవీరులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో అధికారయంత్రాంగం ప్రశాంతంగా విధులు నిర్వహిస్తున్నారంటే నాడు పోలీసు త్యాగాల ఫలితమేనన్నారు. ప్రభుత్వాలు తీసుకువచ్చే చట్టాలను నిష్పక్షపాతంగా అమలుచేయడంలో పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రజాస్వామ్య దేశానికి ఇది చాలా కీలకమన్నారు.

పోలీసుకమిషనర్ సునిల్‌దత్ మాట్లాడుతూ సమాజం కోసం భవిష్యత్ తరాల కోసం, ప్రజారక్షణ కోసం పోలీసులు అహర్నిశలు తమ ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. పోలీసులు లేని (మిగతా 6వ పేజీలో)

ఇందిరమ్మ కమిటీలకు ఓకే

- 587 కమిటీలకు ఆమోదం తెలిపిన కలెక్టర్
- 'ఇందిరమ్మ' ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కమిటీలదే కీలకపాత్ర
- ఒక్కో నియోజకవర్గంలో 3500 ఇళ్ల నిర్మాణం

ఖమ్మం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రప్రభుత్వం గ్రామాలు, మునిసిపల్ పట్టణాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల పర్యవేక్షణ కోసం ఏర్పాటుచేసిన ఇందిరమ్మ కమిటీలు జిల్లాలో అధికారికంగా అమల్లోకి వచ్చాయి. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లాలో 589 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీలకుగాను 587 పంచాయతీ ఇందిరమ్మ గ్రామ కమిటీలకు సోమవారం ఆమోదం తెలిపారు.



ఇంకా బోనకల్ మండలం రావినూతల, కల్లూరు మండలం పేరువంచ ఇందిరమ్మ గ్రామ కమిటీలు నియమించాల్సి ఉంది. ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు మధిర, సత్తుపల్లి, వైరా మునిసిపాలిటీల్లోని 125 వార్డులకు సంబంధించి కమిటీలు కూడా ఇంకా నియామకం కాలేదు. కేవలం గ్రామ పంచాయతీల్లోని ఇందిరమ్మ కమిటీలకు మాత్రమే ఆమోదం లభించింది. గ్రామ పంచాయతీ పరిధిలో ఏడుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీల నియామకం చేశారు. గ్రామంలోని పంచాయతీ స్పెషలాఫీసర్, కార్యదర్శితోపాటు స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలనుంచి ముగ్గురితో మొత్తం ఏడుగురు సభ్యులతో కమిటీని నియమించారు. మునిసిపల్ పట్టణాల్లోని వార్డుల్లో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ వార్డు స్పెషలాఫీసర్‌తో పాటు స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి ముగ్గురితో కమిటీలు నియమించాల్సి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టబోతుంది. ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరగనుంది. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలో కమిటీలు లబ్ధిదారుల ఎంపిక, సోషల్ ఆడిట్‌లో తమవంతు పాత్ర పోషించనున్నాయి. అధికారులు సర్వే ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ అర్హుల జాబితా తయారీలో కూడా ఇందిరమ్మ కమిటీల పాత్ర ఉండే అవకాశం ఉంది.

నేడు 'దిశ' సమావేశం

- కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష
- చైర్మన్ హోదాలో పాల్గొననున్న ఎంపీ రఘురాంరెడ్డి

6

'మిథిల'కు సొబగులు

- రూ.1.69 కోట్లతో షెడ్ల నిర్మాణం
- భద్రాద్రిలో 'ప్రసాద్' అభివృద్ధి పనులు ప్రారంభం

అది ఓ జాతీయ రహదారి. ప్రజల ప్రాణాలకు మృత్యు మార్గమైంది. పేరుకు జాతీయ రహదారి అయినా అడుగడుగునా గుంతలతో ఆ దారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఈ రహదారిపై అదుపుతప్పి అనేకమంది ప్రయాణికులు గాయాల పాలయ్యారు. ఇటీవల ఓ యువకుడు మృత్యు వాతపడ్డాడు. అది మరెక్కడో కాదు.. ఖమ్మానికి కూతవేటు దూరంలో ఉన్న కొణిజర్ల, వైరా మధ్య జాతీయ రహదారి.



మృత్యు రహదారి

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా..!

- గుంతల రోడ్లపై తరుచూ ప్రమాదాలే
- ఆ మూడు కిలోమీటర్లు మరీ అధ్వానం
- ఆర్‌అండ్‌బీ తీరుపై వాహనదారుల ఆగ్రహజ్వాలలు

కొణిజర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆ గుంతల రోడ్లపై ఎవరి ప్రాణం ఎప్పుడు పోతుందో అర్థంకాని పరిస్థితి. ఇక్కడ రోజుకో ప్రమాదమైన జరగడం పరిపాటిగా మారింది. గుంతల రోడ్డుతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఈ గుంతలతో ప్రాణాలు పోవాల్సిందేనా అని అధికారుల తీరుపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోల్లో ప్రయాణం చేస్తున్న వారు ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. కొందరు గుంతలను తప్పించబోయి ప్రాణాలను కోల్పోతున్నారు. ఇటీవల ఓ యువకుడు బండిపైనుంచి పడి మృత్యువాతపడ్డాడు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు.

జాతీయరహదారి కాదు, గుంతల రహదారి

కొణిజర్ల మండలం తనికెళ్ల నుంచి మొదలుకొని వైరా వరకు జాతీయ రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. ఇటీవల వర్షాలకు భారీ గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారిపై ప్రయాణాలు సాగిస్తుంటాయి. కొణిజర్ల నుంచి పల్లిపాడు మధ్య ఉన్న రహదారి మూడు కిలోమీటర్ల పోవడవునా అడుగడుగునా గుంతలతో మరీ అధ్వానంగా మారింది. ఈ రహదారిపై వాహనదారులు అరిచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఖమ్మానికి అతి దగ్గరలో ఉన్న రహదారి కావడంతో ఏ చిన్న అవసరం వచ్చినా ఖమ్మం వెళ్తుంటారు.


గుంతలను తప్పించబోయి దూసుకెళ్లిన కెమికల్‌లోడు ట్యాంకర్

గుంతలతో తరుచూ ప్రమాదాలే...

కొణిజర్ల- పల్లిపాడు మధ్య గుంతల రోడ్డుపై రోజుకో ప్రమాదం చోటు చేసుకుంటోంది. సెప్టెంబరు, అక్టోబరులోనే పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున గుజరాత్ వెళ్లే కెమికల్‌లోడు ట్యాంకర్ గుంతలను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకు పోయింది.

నిండు ప్రాణం గుంతలకు బలి

మండల పరిధిలోని తనికెళ్లకు చెందిన శివకుమార్ గుంతలను తప్పించబోయి కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాలుగు రోజుల క్రింత రెండు కార్లు గుంతలను తప్పించబోయి ఢీకొన్నాయి. ప్రాణనష్టం జరగకపోయిన వాహనాలు రెండు దెబ్బతిన్నాయి. వారం రోజుల క్రితం ఓ ద్విచక్రవాహనం గుంతల్లో పల్టీ కొట్టింది. అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గతంలో ఇదే పల్లిపాడు గుంతల వద్ద వైరాకు చెందిన టీడీపీ చెందిన నాయకుడు తీవ్రంగా గాయపడ్డాడు.



గుంతలను పూడ్చండి : తాటిపల్లి సుధీర్

పల్లిపాడు-కొణిజర్ల మధ్య ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రాణాలను కాపాడాలి. అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించడంలేదు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే గుంతలకు మరమ్మతులు చేపట్టాలి. ప్రజల ప్రాణాలను కాపాడాలి.



ప్రయాణం చేయాలంటేనే భయంమేస్తోంది : కొమ్మిని సతీష్

ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయంమేస్తోంది. నెలల కొద్ది గుంతలతో రోడ్డు కనిపిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదు. తాత్కాలిక మరమ్మత్తులు చేసైన గుంతలను పూడ్చాలి.



ప్రజలను బలి తీసుకుంటున్న గుంతలు: యర్రాబాబు

రోడ్డుపై ఏర్పడిన గుంతల వల్ల సామాన్య ప్రజలు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తనికెళ్ల నుంచి మొదలు కొని వైరా చేరే వరకు ప్రయాణం కష్టంగా మారింది. పల్లిపాడు-కొణిజర్ల మధ్య వాహనం నడుపుతూ రెప్పపాటు అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పోవాల్సిందే. రోడ్డుపై ఉన్న గుంతలు అధికారులకు కనిపించటంలేదా? అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలి.

వైద్య వృత్తితో సామాజిక సేవ

- ఖమ్మం మెడికల్ కళాశాలలో ఫస్టియర్ వైద్య, విద్య తరగతులు ప్రారంభం
- కళాశాలలో పూర్తిస్థాయిలో రెండో బ్యాచ్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'అన్ని వృత్తుల్లోకి వైద్య వృత్తికి ఎంతో ప్రాధాన్యత ఉంది. సమాజానికి కూడా సేవ చేసే భాగ్యం వైద్యులకే దక్కుతుంది...! . మీరు స్వీకరించబోతున్న వృత్తి చాలా పవిత్రమైనది. దాన్ని మీరు ఛాలెంజ్‌గా తీసుకుని భవిష్యత్తులో డాక్టర్లుగా ఎదిగి వృత్తికి గౌరవాన్ని తీసుకురావాలి...' అని ఖమ్మంవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు అన్నారు. ఖమ్మం వైద్య కళాశాలలో రెండో బ్యాచ్ మెదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా. మెడికల్ కళాశాల ఏర్పాటుతో జిల్లాలో కలిగే ప్రయోజనాలను వివరించారు. కళాశాల ప్రారంభించిన తొలి ఏడాదిలోనే ఇక్కడి మొదటి బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు ఘన విజయాన్ని సాధించారని అన్నారు. హాజరైన విద్యార్థులంతా ప్రథమ స్థానంలో విజయం సాధించారని అన్నారు. ఇదే స్ఫూర్తితో రెండో బ్యాచ్ విద్యార్థులు కూడా మొదటి ఏడాదిలో మంచి ఫలితాలు సాధించాలని దీనికి తగిన విధంగా కృషిచేయాలన్నారు. పట్టుదల అంకితభావంతో చదివి ఎంబీబీఎస్‌ను పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన వైద్య విద్యార్థులకు వివిధ విభాగాల అధిపతులు ఉపోద్ఘాతం తరగతులను నిర్వహించారు. వారం రోజులపాటు మొదటి ఎంబీబీఎస్ విద్యార్థులకు ఈ తరగతులను నిర్వహించనున్నట్లు ఆ తర్వాత పూర్తిస్థాయిలో తరగతులను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, డాక్టర్ కిరణ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు

రైతుబజార్ కూరగాయల ధరలు

(కూరగాయలు కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	40
వంకాయ	40
గుత్తి వంకాయ	43
బీరకాయ	54
పచ్చిమిర్చి	58
కాకరకాయ	34
బెండకాయ	38
పొట్లకాయ	50
దోసకాయ	48-50
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	34
దొండ	40-48
సొరకాయ	30
క్యారెట్	54
క్యాప్సికం	70
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	55-60
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

పత్తి రైతులూ.. తెలుసుకోండి

- క్వింటాలు పత్తికి రూ. 7,521ల మద్దతు ధర పొందండి
- 'సీసీఐ' కొనుగోలు కేంద్రంలో నిబంధనలు ఇవే

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ప్రైవేటు దళారులను, మధ్యవర్తులను ఆశ్రయించకుండా జిల్లా మార్కెటింగ్ శాఖ, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 9 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. సదరు సీసీఐ కేంద్రాలను జిన్నింగ్ మిల్లుల కేంద్రంగా రైతులకు ఎటు వంటి ఇబ్బంది తలెత్తకుండా నేరుగా లూజు పత్తినే కొనేందుకు పూనుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు జీఆర్‌ఆర్ జిన్నింగ్ మిల్లు వద్ద సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని లాంచనంగా ప్రారంభించారు. సదరు కొనుగోలు కేంద్రాలలో రైతులు సీసీఐ నిబంధనలు తప్పనిసరిగా తెలుసుకొని 2024-2025 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం పత్తికి ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 లను పొందొచ్చు.

జిల్లాలో ఏర్పాటు చేసిన 9 కేంద్రాలు ఇవే

జిల్లా వ్యాప్తంగా మొత్తం 9 కేంద్రాలలో పత్తిని కొనుగోలు చేసేందుకు మార్కెటింగ్ శాఖ నిర్ణయించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో గుర్రాలపాడు జీఆర్‌ఆర్ జిన్నింగ్ మిల్లు, తల్లంపాడు సాయిబాలాజీ జిన్నింగ్ మిల్లు, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో ముదిగొండ మండలం సువర్ణాపురంలోని ఉషాశ్రీ జిన్నింగ్ మిల్లు, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో పొన్నెకల్ గ్రామంలోని జీఆర్‌ఆర్ జిన్నింగ్ మిల్లులో, తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులోని భాగ్యలక్ష్మి జిన్నింగ్ మిల్లు, వైరా వ్యవసాయ మార్కెట్ పరిధిలో తల్లాడ స్టాపిల్‌రిచ్ జిన్నింగ్ మిల్లు, మధిర వ్యవసాయ మార్కెట్ పరిధిలో మంజీత్, అమరావతి, శ్రీశివగణేష్ జిన్నింగ్ మిల్లులలో నేరుగా రైతులు తమ పంటను అమ్ముకోవచ్చు.



తేమ శాతం, ధరల వ్యత్యాసం ఇలా

సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ పంటను భారత పత్తి సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పత్తిని తీసుకురావాలి. పత్తిలో కొడి, చెత్త లేకుండా 8 శాతం వరకు తేమ ఉంటే క్వింటాలుకు రూ. 7,521 లు, 9 శాతం ఉంటే రూ. 7,446 లు, 10 శాతానికి రూ. 7,295లు, 11, 12 శాతం ఉంటే రూ. 7,220లు చెల్లించనున్నారు. తేమ శాతం 8 శాతం కన్నా ఎక్కువగా ఉంటే ప్రతి ఒక్క శాతానికి క్వింటాలుకు రూ. 75.21 పైసలు చొప్పున తగ్గుతుందన్నమాట.

నాణ్యత ప్రమాణం, తీసుకురావాల్సిన పత్రాలు

భారత పత్తి సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం పింజ పొడవు 29.5-30.5 మిల్లీ మీటర్లు ఉండాలి. రైతులు కొనుగోలు కేంద్రానికి వచ్చేటపుడు తమ ఆధార్, ఆధార్ లింక్ ఉన్న బ్యాంక్ ఖాతా, భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ లింక్ అయిన మొబైల్ నెంబరు ఇవ్వాల్సి ఉంటుంది. పంటతాలూకా నగదు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ అవుతుంది.

క్షేత్రస్థాయి అధ్యయనం ఎంతో కీలకం

ఏఐఎస్, సీసీఎస్ అధికారులతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నప్పుడే ప్రభుత్వ అధికారి, తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. తెలంగాణ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ సంస్థచే ప్రత్యేక ఫౌండేషన్ కోర్స్ లో భాగంగా జిల్లాలో క్షేత్రస్థాయి అధ్యయనానికి వచ్చిన ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అధికారులతో కలెక్టర్ సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖమ్మం జిల్లా ఉద్యమాల జిల్లా అని, చారిత్రకంగా ప్రాముఖ్యం కలిగిన జిల్లా అని అన్నారు. జిల్లాకు వచ్చిన అధికారులు 4 బృందాలుగా జిల్లాలోని తిరుమలాయపాలెం, కామేపల్లి, సింగరేణి, ఏన్కూరు మండలాల్లో కేటాయించిన గ్రామాల్లో ఈ నెల 21 నుండి 28 వరకు 8 రోజులపాటు పర్యటించి, క్షేత్రస్థాయిలో ప్రజల స్థితిగతులు, ప్రభుత్వ సంస్థల పనితీరు, ప్రభుత్వ పథకాల లబ్ధి పై పరిశీలిస్తారని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్. పి. శ్రీజ, జెడ్పి సీఈవో దీక్షా రైనా, ఎంసీహెచ్‌ఆర్డీ ప్రాంతీయ శిక్షణ కేంద్ర మేనేజర్ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఖమ్మం యువకుడి మృతి

ఖమ్మం క్రైం,అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. యువకుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పాకబండ బజార్‌కు చెందిన మేదెల పిచ్చయ్య నగరంలో జిలేబీ షాపులో పని చేస్తున్నారు. ఆయన కుమారుడు పవన్ కళ్యాణ్(25) 10వతరగతి వరకు చదువుకున్నాడు. కొన్నేళ్ళుగా మద్యానికి బానిసై తిరుగుతుండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ దమ్మాయిగూడలోని ఓఫౌండేషన్ చేర్పించారు. ఏడాదిగా అక్కడే ఉంటున్న పవన్ ఇటీవల దసరా పండగకు ఇంటికి వచ్చి తిరిగి ఫౌండేషన్‌కు వెళ్ళాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కాని, సోమవారం ఉదయం పవన్ మృతి చెందాడని ఫౌండేషన్ సభ్యులు ఫోన్‌చేసి తెలిపారు. వెంటనే అక్కడికి వెళ్ళిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూడగా మృతునికి డైపర్ వేసి ఉంది. బట్టలు కూడా సరిగ్గా లేవు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బట్టలు తీసి చూడగా ఒళ్ళంతా కమిలిపోయి, గాయాలు ఉన్నాయి. కాగా పవన్ మృతిపై అనుమానాలు ఉన్నాయని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు 'దిశ' సమావేశం

ఖమ్మం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత మొదటిసారి ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశం మంగళవారం జరగనుంది. కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి చైర్మన్‌గా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కన్వీనర్‌గా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వ్యవహరిస్తారు. ఎంపీగా రఘురాంరెడ్డి గెలిచిన తర్వాత మొదటిసారి ఈసమావేశం జరుగుతోంది. వాస్తవానికి మూడు నుంచి ఆరునెలల్లో ఒకసారైనా ఈ సమావేశం క్రమం తప్పకుండా జరిగితే నియోజకవర్గ అభివృద్ధిపై అధికారుల దశ, దిశ నిర్దేశంతో పాటు కేద్ర ప్రభుత్వ పథకాలు అమలు జరిగే తీరు స్పష్టం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నా జిల్లా స్థాయి అధికారులు వాటి అమలు, నిధుల సద్వినియోగం విషయంలో నిర్లక్ష్యంగాననే వ్యవహరిస్తున్నారు. కాగా, దిశ కమిటీ సమావేశంలో జిల్లాకు సంబంధించిన పూర్తిస్థాయి పథకాలు, కార్యక్రమాలపై సమీక్ష జరిగితే అధికారులు కూడా కొంత పట్టుదలతో పనులు జరిపే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలపై కూడా అవగాహన రావాల్సి ఉంది. ప్రతి శాఖలోను కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక పథకాలు అమలవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేసే పథకాల్లో ప్రధానంగా నేషనల్‌హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాతీయ రహదారులు, మౌలిక వసతుల కల్పనతో పాటు పలు ఇతర పథకాల నిధులు, పనులపైనా దిశ కమిటీ సమావేశంలో చర్చించే అవకాశం ఉంటుంది. ఈసమవేశం ద్వారా లోక్‌సభ నియోజకవర్గంలోని పలు సమస్యలతో పాటు పథకాల అమలుకు కార్యచరణ రూపొందించనున్నారు.

కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

ఖమ్మం క్రైం, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఫంక్షన్‌కు వెళ్లిన కానిస్టేబుల్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనపై సోమవారం నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. అశ్వాపురంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హేమతేజ్ ఖమ్మం నగరంలోని ఎన్నెస్పీ క్యాంప్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. తన కుమారుడి పుట్టువెంట్రుకలు తీయించేందుకు శనివారం అన్నవరం ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. వీరితో పాటు టేకులపల్లిలో నివాసం ఉండే కానిస్టుబుల్ సోదరి అయన జయసుధ కూడా వెళ్లింది. ఆ సమయంలో సోదరి జయసుద బంగారం 16తులాలు కానిస్టేబుల్ ఇంటిలో దాచి ఉరు వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి అందరు ఇంటికి చేరుకుని ఇంటిలో చూడగా 16తులాల బంగారం, రూ.50వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్టు గుర్తించి ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

(5వ పేజీ తరువాయి)

సమాజంను ఊహించలేమని, శాంతిభద్రతల కట్టడిలో పోలీసు వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తుందన్నారు.

అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబల సభ్యులతో కలెక్టర్ , సీపీ లు మాట్లాడి వారికి ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అదేవిధంగా పలు సమస్యలపై కలెక్టర్, సీపీకి అమరవీరుల కుటుంబసభ/్యలు వినతి అందించారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, విజయ్‌బాబు, ఏసీపీలు వెంకటేష్, రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహమాన్, రఘు, సాంబరాజు, రవి, మల్లయ్య, నరసయ్య, ఆర్:ఐలు కామరాజు,శ్రీశైలం, సురేష్, అప్పలనాయుడు సీఐలు ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, రమేష్, భానుప్రకాష్, రామకృష్ణ, సతీష్, స్వామి పాల్గొన్నారు. కాగా, అమరవీరుల స్థూపానికి పోలీసు కుటుంబాల వారు పుష్పాలతో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఉద్వేగపూరిత దృశ్యాలు కనిపించాయి.

త్రీటౌన్ సీఐకి అస్వస్థత

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా నగరంలోని పోలీసపరేడ్ మైదానంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. అమరవీరుల స్థూపంకు సెల్యూట్ చేస్తూనివాళులర్పిస్తున్న సమయంలో త్రీటౌన్ సీఐ రమేష్ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. పక్కనే ఉన్న పోలీసు అధికారులు సీఐని కుర్చీలో కూర్చోబెట్టి సపర్యలు చేశారు. అనంతరం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చారు. జ్వరం, శారీరక అలసటతో ఫిట్స్ వచ్చి కింద పడిపోయినట్టు తెలిసింది.

బిల్ కలెక్టర్ రాసిచ్చినా బేఖాతర్

ఖమ్మం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు కొత్త అధికారులు పాతదారిలోనే నడుస్తున్న సంఘటనలో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించే విషయంలో బిల్ కలెక్టర్ రాసిచ్చిన విచారణ నివేదికను సైతం బేఖాతరు చేసి మరీ ఇంటి నెంబరు కేటాయించినట్టు ప్రచారం జరుగుతోంది. సెల్ఫ్ అసెస్‌మెంట్ వేసిన తర్వాత బిల్ కలెక్టర్ విచారణకు వెళ్లిన సందర్భంలో అక్కడ ఎలాంటి నిర్మాణం లేదంటూ సంబంధిత బిల్ కలెక్టర్ నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. ముందుగా బేరం కుదుర్చుకున్న కార్యాలయ అధికారులు ఆ రిపోర్టును పక్కన పడేసి, ఖాళీ స్థలానికి పక్కన ఉన్న ఇంటి ఫోటో పెట్టి అప్రూవల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. కాగా సోమవారం 'కొత్త అధికారులు పాతదారిలోనే' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై నిఘా వర్గాలు ఆరా తీశాయి. సంబంధిత ఖాళీ స్థలం వద్దకు వెళ్లి వివరాలు సేకరించాయి.

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

ఇల్లెందు టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియతో పాటు 20 మంది బీఆర్‌ఎస్ నాయకులపై సోమవారం రాత్రి ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాలని కోరుతూ ఆదివారం ఇల్లెందులో దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై అందిన ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనంపై అందిన ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే హరిప్రియతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల్ రాజేందర్ బీఆర్‌ఎస్ నాయకులు సిరివెరి సత్యనారాయణతో పాటు మరో 20 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

మహిళా శక్తి వర్ధిల్లాలి..

(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, అదే జరిగితే వేలాదిమంది కార్మికులు జీవనోపాది కోల్పోతారన్నారు.

సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల కోసం గిరిజనులు, బడుగుబలహీన వర్గాల నుంచి భూసేకరణ చేస్తున్నారని, కానీ వారికి సరైన నష్టపరిహారం అందించడంలేదన్నారు. గతంలో ఇళ్ల స్థలాల కోసం అనేక పోరాటాలు చేసిన మహిళలను గత బీఅర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని గుర్తుచేశారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై మోదీ, అమీత్‌షా, అర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌లు సమాధానం చెప్పాలని నిలదీశారు. దేశంలో ప్రతి గంటకు 50మంది మహిళలపై ఏదో ఒక రూపంలో హింస జరుగుతోందన్నారు. రోజుకు 88మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయన్నారు. బీజేపీ పాలనలో మహిళలపై 28శాతం నేరాలు పెరిగాయన్నారు. మోటూరి ఉదయం, లీలా సుందరయ్య, మల్లు స్వరాజ్యం, చిచ్చాల ఐలమ్మ, మానికొండ సూర్యావతి వంటి త్యాగధనుల పోరాట వారసత్వాన్ని పునికిపుచ్చుకుని దోపిడీ విధానాలపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. బహిరంగసభలో సీపీఎం మాజీ ఎంపీ మిడియం బాబురావు, ప్రజాతంత్ర జాతీయ ప్రధానకార్యదర్శి ధావలే, జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి, జాతీయ కోశాధికారి పుణ్యవతి, జాతీయ ఉపాధ్యక్షురాలు సుందర రామన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లులక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీతాలక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో భారీ ర్యాలీ..

రాష్ట్ర మహాసభల సందర్భంగా కొత్తగూడెంలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన బారీ ర్యాలీలో మహిళా కళారూపాలు కట్టుకున్నాయి. భద్రాచలం ఆదీవాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా రేలా, డోలు నృత్యాలు, కోలాటం చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ ర్యాలీ లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యాడ్ నుంచి మొర్రెడుబిడ్జి, రైల్వేస్టేషన్ మీదుగా సూర్యాప్యాలెస్ వరకు కొనసాగింది.

సగం ఉత్పత్తి ప్రైవేటు కంపెనీల చేతుల్లోనే..

సింగరేణి కంపెనీలో సగం బొగ్గు ఉత్పత్తి సింగరేని కార్మికులు తీస్తుండగా మిగిలిన సగం మొత్తం ప్రైవేటు కంపెనీలే చేస్తున్నాయని బృందాకరత్ ఆరోపించారు. మణుగూరు ఏరియాలోని పలు ఓసీలను, కొండాయాజీ మైన్‌లను సోమవారం సందర్శించి, కొండాపురం గిరిజన ప్రజలతో మాట్లాడారు. భూ నిర్వాసితుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఓసీల వల్ల వేలాది ఎకరాల ప్రభుత్వ అటవీ భూములు ధ్వంసమయ్యాయని తెలిపారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయకపోవడంతో గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. భూ నిర్వాసిత గిరిజనులకు సింగరేణి సక్రమం నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. 1991 నుంచి సింగరేణిలో ప్రవేటీకరణ వేగంగా పెరుగుతోందన్నారు. మణుగూరు ఏరియాలో గుజరాత్‌కు చెందిన ఓబీ కంపెనీల్లో కార్మికుల హరిస్తున్నారన్నారు. సరైనసౌకర్యాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, మణుగూరు ఏరియా సీఐటీయూ నాయకులు రమాదేవి, నెల్లూరి నాగేశ్వరరావు, టీపీఎంపీ ప్రసాద్, డి. లెనిన్‌బాబు, విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై పోరాటాలు

నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలపై దేశ వ్యాప్తంగా సమస్యల పోరాటాలు నిర్వహిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలను బలపరచాలని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే విజ్ఞప్తి చేశారు. ఐద్వా సభలో ఆమె మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు, మహిళలపై హింస వంటి కీలకమైన సమస్యలను పరిష్కారం చేయటంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. ప్రజల దృష్టిని బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ మళ్లిస్తున్నాయని విమర్శించారు.

మత్తు పదార్థాలు నియంత్రించాలి

మద్యపానం నియంత్రణ చేపట్టాలని, మత్తు పదార్థాలను నియంత్రించడంలో కఠినంగా ప్రభుత్వాలు వ్యవహరించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ డిమాండ్ చేశారు. బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. మద్యాన్ని ప్రభుత్వాలు ఆదాయ వనరుగా చూస్తున్నాయని అన్నారు. మద్యం ఏరులై పారటం మూలాన కుటుంబ వ్యవస్థ మొత్తం చిన్నాబిన్నం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుందన్నారు. మద్యం, మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఐద్వా పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.

మిథిలా స్టేడియానికి సొబగులు

- రూ.1.69 కోట్లతో షెడ్ల నిర్మాణం
- ప్రారంభమైన పనులు

భద్రాచలం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంకు చెందిన మిథిలా స్టేడియంకు సరికొత్త సొబగులు అద్దుతున్నారు. 'ప్రసాద్' పథకంలో భాగంగా రూ. కోటి 70 లక్షలతో కల్యాణ మండపం ముందు భాగం వైపు షెడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రతి ఏటా చైత్రశుద్ధ నవమి నాడు శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణంను మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో నిర్వహించే విషయం విదితమే.

కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' పథకం ద్వారా భద్రాద్రిలో రూ.41.38 కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ఈ పనులకు 2022 డిసెంబరు 28న అప్పటి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో భద్రాచలంలో భక్తుల వసతి గదుల నిర్మాణం, రామాలయంతో పాటు పర్ణశాల ప్రధాన ఆలయంలో నిత్యకల్యాణం జరిగే ఆలయ ఆవరణ, నిత్యకల్యాణం జరిగే ప్రాంతంలో గ్రానైట్ స్టోన్‌తో ఫ్లోరింగ్ పనులు, భక్తులకు నూతన క్యూలైన్ల నిర్మాణం, రామాలయంలో నూతన షెడ్ల నిర్మాణంతో పాటు ప్రసాదాల తయారీని మరింతగా ఆధునీకరించే పనులు చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా స్టేడియంలో షెడ్ల నిర్మాణంకు సంబంధించిన పనులు ప్రారంభించగా వాటిని సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ షెడ్ల నిర్మాణం సీఎం, ఉభయదాతల సెక్టార్ల వరకు నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రక్రీడల్లో పతకాలు సాధించేలా శిక్షణ ఇవ్వాలి

» ఐటీడీఏ పీవో రాహుల్



విద్యార్థినికి నగదు అందిస్తున్న పీవో

భద్రాచలం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఆశ్రమపాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించేలా తగిన శిక్షణ ఇవ్వాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏవో రాంబాబు, ఇన్‌చార్జి ఎస్వో భాస్కరన్, ఎస్‌డీసీ రవీంద్రనాథ్ పాల్గొన్నారు. పాలమూరు యూనివర్సిటీలో ఎంబీఏ సీటు సాధించిన బూద్దుల కవిత విద్యార్థినికి రూ.30 వేలు, ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన భూక్య శ్రీవిద్యకు రూ.50 వేల నగదును పీవో రాహుల్ అందించారు.

రొయ్యపిల్లల సరఫరా సాధ్యమేనా?

» ఏటా సెప్టెంబరు, అక్టోబరులో పంపిణీ
» ఈ ఏడాది నేటికీ పూర్తికాని టెండర్లు ప్రక్రియ
» అగ్యమగోచరంగా మత్స్యకారుల పరిస్థితి
» పిల్లల సరఫరాకు మంత్రి పొంగులేటి చర్చలు



వైరా,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఉచిత రొయ్యపిల్లల సరఫరా ఆచరణ సాధ్యమేనా? అని మత్స్యకారులు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని మత్స్యకారులు ఉచిత రొయ్య సీడ్ సరఫరా కోసం ఎదురుచూస్తున్నప్పటికీ.. వారి ఆశలు ఫలించే పరిస్థితి కానరావటం లేదు. ఉచిత చేపపిల్లల సరఫరా ప్రక్రియ ప్రారంభమైనా, ఉచిత రొయ్య సీడ్ ప్రక్రియ గురించి ప్రభుత్వంలో ఇంతవరకు ఎలాంటి కదలిక లేదు. ఒకవేళ ప్రభుత్వం సీడ్ సరఫరాకు చర్యలు చేపట్టినప్పటికీ తీవ్ర కాలయాపన జరిగినందున అది సాధ్యమవుతుందో కూడా అంతుపట్టని పరిస్థితి.

గతంలో పదికోట్ల రొయ్య సీడ్

గతబీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏటా సీజన్‌లో సప్లయి ఆఫ్ ఫ్రాన్ జోనైల్స్ స్కీం కింద దాదాపు పదికోట్ల రొయ్యపిల్లల సరఫరాకు టెండర్లు పిలిచేవారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఉచిత చేపపిల్లలతోపాటు రొయ్యపిల్లలను కూడా రిజర్వాయర్లు ఇతర నీటి వనరులకు సరఫరా చేసేవారు. 1.5అంగుళం సైజు కలిగిన ఒక్కో రొయ్యపిల్లను రూ.2.50చొప్పున ప్రభుత్వం టెండర్ల ద్వారా కొనుగోలు చేసి మత్స్యకారులకు ఉచితంగా సరఫరా చేసేవారు. కనీసం రొయ్యపిల్లలు తయారైన తర్వాత 45రోజులు వాటిని హ్యాచరీల్లో పెంచి సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇలా జూలై, ఆగస్టు నెలల్లోనే ఈ రొయ్యపిల్లల సరఫరాకు టెండర్లు ఆహ్వానించి సరఫరాదారులతో ఒప్పందాలు చేసుకునేవారు. హెక్టార్‌కు 500 రొయ్య పిల్లలను అందించేవారు. అయితే ఈ ఏడాది ఇంత వరకు ఈ రొయ్య సీడ్ సరఫరాకు సంబంధించి టెండర్లు ఆహ్వానించలేదు.

ఖమ్మంజిల్లాలో పరిస్థితి...

ఖమ్మంజిల్లాలోని పాలేరు, వైరా, లంకాసాగర్, బేతుపల్లి గంగారం రిజర్వాయర్లకు ఉచిత రొయ్య సీడ్‌ను గతంలో సరఫరా చేశారు. పాలేరు, వైరా రిజర్వాయర్‌లలో 7లక్షల చొప్పున, లంకాసాగర్‌లో ఆరులక్షలు, బేతుపల్లి గంగారంలో మూడు లక్షల రొయ్యపిల్లలను విడుదల చేసేవారు. అయితే వైరాకు 2022 సీజన్‌లో 2023 సీజన్‌లో కూడా రొయ్యపిల్లలను సరఫరా చేయలేదు. ఈరెండు సీజన్లలో కూడా ప్రభుత్వం రొయ్య సీడ్ టెండర్లను ఖరారు చేసినప్పటికీ, నాసిరకం రొయ్య సీడ్‌ను సరఫరా చేయడంతో మత్స్యకారులు అడ్డుకున్నారు. దాంతో సదరు కాంట్రాక్టర్ నాణ్యత గల రొయ్య సీడ్‌ను పోసే ప్రయత్నం చేయలేదు. మత్స్యకారులే సొంత ఖర్చులతో రొయ్య సీడ్ పోసుకున్నారు. పాలేరు రిజర్వాయర్‌లో కూడా ఒక సంవత్సరం రొయ్యసీడ్ పోయలేదు.

మంత్రి పొంగులేటి పట్టుదల

రాష్ట్రంలో ఉచిత రొయ్య సీడ్ సరఫరా చేసే విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పట్టుదలగా ఉన్నారు. ఈ విషయమై మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక అలాతో మంత్రి చర్చించారు. విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన అన్ని అనుమతులు ఇప్పిస్తానని విధివిధానాలు ఖరారు చేయాలని డైరెక్టర్‌కు స్పష్టం చేసినట్లు సమాచారం. వైరాలో ఉచిత చేపపిల్లల కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి రొయ్య సీడ్ సరఫరాకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. యుద్ధ ప్రాతిపదికన రొయ్య సీడ్‌టెండర్ల ప్రక్రియ చేపట్టి పూర్తిచేసినప్పటికీ, రెండునెలల సమయం పట్టే అవకాశముంది. ఈ నేపథ్యంలో సీడ్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ఖమ్మం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ

పనులు నాణ్యతగా ఉండాలి

» ఎంపీ రఘురాంరెడ్డి
» ఖమ్మం రైల్వేస్టేషన్ సందర్శన

ఖమ్మంమామిళ్లగూడెం, అక్టోబరు రు 21 (ఆంధ్రజ్యోతి): పనులు నాణ్యతగా ఉండాలని, ప్రయాణికులే మనకు ప్రాధాన్యమని దీనికి రైల్వేశాఖ అన్నిచర్యలు తీసుకోవాలి ఎంపీ రఘురాంరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన ఖమ్మం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రూ.25 కోట్లతో జరుగుతున్న ఆధునీకీకరణ పనులను పరిశీలించారు. మూడో వంతెన పనులు, ఎస్కులేటర్, ప్లాట్‌ఫారంల విస్తరణ, షెడ్ల పనులు, ప్రయాణీకులు వేచి ఉండే గదులు టాయిలెట్స్‌ను పరిశీలించారు. పనులు నాణ్యతాయతంగా ఉండాలన్నారు. వికలాంగులకు కూడా ఇబ్బంది కలగకుండా ర్యాంపులు ఎక్కడ అవసరం కావాలో అక్కడ ఏర్పాటు చేయాలన్నారు. ఆ తర్వాత స్టేషన్‌కు గాంధీచౌక్ గేట్‌వైపున ఉన్న డ్రెయిన్లను పరిశీలించారు. వర్షాకాలంలో నగరం నుంచి వచ్చే వరద మెత్తం ట్రాక్‌ను ముంచేస్తుందని దీనికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ ఆవరణంలోని సైకిల్, మోటారు బైక్‌ల స్టాండును పరిశీలించారు. ఇక్కడ రేట్లు అధికంగా వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని నియంత్రించాలన్నారు. స్టేషన్ ఎదురుగా ఉన్న వైద్యశాఖ ఖాళీ స్థలాన్ని స్టేషన్‌కు కేటాయిస్తే ఇంకా సౌకర్యాలు కల్పించే ఆస్కారం ఉందని రైల్వే అధికారులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. రైల్వేస్టేషన్ నుంచి పాత మునిసిపల్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ పనులను కూడా త్వరలో చేపట్టనున్నట్లు ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రైల్వే స్టేషన్ మేనేజర్ జీఎన్‌వీ ప్రసాద్, కమర్షియల్ అధికారి జాఫర్‌ఖాన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కుమార్, ఆర్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఏడీఈఎం రమేష్‌బాబు, ఎస్ఎస్‌ఈలు రాం నివాస్, శ్రీనివాస్, విశ్వజిత్ చౌదరి, కాంగ్రెస్ నాయకుడు ముస్తాపా తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు పిచికారితో ఎండిన మిర్చితోట



తోటను పరిశీలిస్తున్న కంపెనీ అధికారులు

ఏన్కూరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): కొత్త రకం పురుగుమందు కొట్టడం వల్లనే మిర్చి పంట ఎండిపోయిందని తక్షణమే నష్టపరిహారం చెల్లించలని కంపెనీ అధికారులను వేడుకుంటున్నాడు ఓ రైతు. మండలంలోని నూకాలంపాడు గ్రామానికి చెందని బీరెల్లి నాగయ్య అనే రైతు 6 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి తోట సాగు చేస్తున్నాడు. ఇప్పటి వరకు ఎకరానికి సుమారు రూ.2లక్షలపైగా పెట్టుబడి పెట్టాడు. ఇటీవల తోటకు తెగుళ్లు ఆశించడంతో ఓ కంపెనీకి చెందిన కొత్తరకం పురుగుమందును ఆదివారం ఉదయం పిచికారి చేశాడు. సోమవారం ఉదయం చేను పక్క రైతు తోట ఎండిపోతుందని చెప్పడంతో లబోదిబోమంటు వెళ్లి తోటను పరిశీలించాడు. దిక్కుతోచని స్థితిలో తోటి రైతులతతో చర్చించి జరిగిన విషయాన్ని పురుగుమందుల దుకాణదారుని ద్వారా కంపెనీ అధికారులకు తెలిపాడు. సోమవారం కంపెనీ అధికారులు వచ్చి మిర్చితోటను పరిశీలించారు. ల్యాబ్‌టెస్టు ద్వారా విషయం బయటపడుతుందని చెప్పడంతో రైతులు కంపెనీ అధికారులను అడ్డగించారు. నష్టపరిమారం చెల్లించాలని లేకుంటే ఇక్కడ నుండి కదలనీయబోమని నిర్బంధిస్తామని హెచ్చరించారు. కంపెనీ అధికారులకు రైతులకు కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. నష్టపరిహారం చెల్లించకుంటే ఇక్కడే మీముందే పురుగుమందు తాగి భార్యభర్తలం ఆత్మహత్య చేసుకుంటామని బోరున విలపించారు. వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేపట్టి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు వేడుకుంటున్నారు.

విద్యార్థుల సమస్యలపై మంత్రులు స్పందించాలి

» పీడీఎస్‌యూ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆజాద్
» కలెక్టరేట్ ఎదుట నిరసన



ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై మంత్రులు స్పందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. పోలీసులు అడ్డగించటంతో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. ఆజాద్ మాట్లాడుతూ విద్యార్థులకు రూ.6,500కోట్లు ప్రభుత్వం పెండింగ్ బకాయిల్ని విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారానికి మంత్రుల నివాసాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గతబీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పట్టించుకోవటం లేదని ఆజాద్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్, వినయ్, చంద్రశేఖర్, పృథ్వి, సందీప్, ప్రసాద్, అనిత,కావ్యదీప్తి, యశ్వంత్, స్టాలిన్, మాల్సూర్, సాయి, కరుణ, వీణ పాల్గొన్నారు.

దిశ సమావేశానికి నివేదికలతో సిద్ధం కావాలి

» ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశానికి అధికారులు ఖచ్చితమైన నివేదికలతో హాజరు కావాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో దిశ కమిటీ సమావేశం సన్నద్ధం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి సమీక్షించారు. అధికారులు తమ శాఖ కార్యకలాపాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గత5సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు, ఖర్చు పెట్టిన నిధులు వివరాలు చూపాలన్నారు. కమిటీ అడిగిన ప్రతీ ప్రశ్నకు అధికారులు స్పష్టంగాజవాబు ఇవ్వాలన్నారు.ఈ సందర్భంగా వివిధ శాఖలలో కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న పథకాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయంలో చీరల పంపిణీ పరిశీలన

భద్రాచలం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఐకేపీ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేస్తున్న చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు పరిశీలించారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో గిరిజన మహిళలకు, 14మండలాల్లో ఉన్న సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మహిళల ద్వారా గుర్తించి, ఐకేపీ ఏపీఎం, సీసీల ద్వారా, ప్రత్యేక అధికారుల సమక్షంలో పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 7,220 మందికి చీరల పంపిణీ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జగదీష్, సీసీలు సీతారాములు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

● కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఓ దివ్యాంగుడితో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కారించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ప్రజల నుంచి అర్జీల ను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జడ్పీ సీఈవో. దీక్షా రైనా, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులున్నారు.

- కల్లూరు మండలం పేరువంచ గ్రామానికి చెందిన దుర్గ తన భర్త మరణించారని, తనకు వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మండల ఎంపీడీవోను పరిష్కారానికి ఆదేశించారు.

- ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో రామన్నపేట కాలనీ వాసులు 60వ డివిజన్‌లో వరదల కారణంగా ఇండ్లు పూర్తిగా మునిగిపోయాయని, సర్వే పూర్తయినప్పటికీ తమకు ప్రభుత్వ సహాయం అందలేదని దరఖాస్తు చేసుకున్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ నగర పాలక సంస్థ కమిషనర్ విచారించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

- ఖమ్మం నగర పాలక సంస్థ 37వ డివిజన్‌కు చెందిన తలారి సుగుణమ్మ, తన భర్త చనిపోయారని తనకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెల 35 కిలోల బియ్యం ఇప్పించాలని ఆమె విన్నవించారు.

తొలగని ఇసుక మేటలు

» వానాకాలంతో పాటు యాసంగి సాగూ కష్టమే
» ఇసుకమేటలు తొలగించాలంటే ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు
» పరిహారం ఇప్పించాలంటున్న రైతులు



హట్యాతండ వద్ద ఎడారిని తలపిస్తున్న వరిపొలాలు

కూసుమంచి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గతనెలలో వర్షాలతో పాలేరు, ఆకేరు పరీవాహక ప్రాంతంలో ఉప్పొంగడంతో నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయి. సెప్టెంబరు 1న రాత్రి కురిసిన భారీ వర్షం సృష్టించిన బీభత్సంతో చెరువులు, కుంటలు తెగిపోయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలేరు నుంచి, పరీవాహక ప్రాంతాల్లో ఎగువ నుంచి పాలేరు జలాశయానికి వరద ముంచెత్తింది. లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో సాగులో ఉన్న వరి పొలాలకు భారీ నష్టం వటిల్లింది. ఈవరద రైతాంగానికి అంతులేని విషాదాన్ని మిగిల్చింది. చాలా చోట్ల ఇసుకమేటలు, రాళ్లతో నిండిప పొలాలు, కొన్ని చోట్ల పంట భూములు కోతకు గురయి పంట కాల్వలను తలపిస్తున్నాయి. ఇసుక, రాళ్ల కప్పేసిన తమ పొలాలను చూసుకుంటే ఎక్కడ ఎవరి పొలం ఉందో గుర్తుపట్టలేకుండా ఉంది.

కొందరికే పంట పరిహారం

వరదలు వచ్చిన అనంతరం 20రోజులపాటు వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రసాయిలో పరిశీలించారు. పంట నష్టాన్ని లెక్కించారు. 28వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారికంగా గుర్తించారు. కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లో అత్యధికంగా నష్టం వాటిల్లింది. కాగా ప్రభుత్వం ప్రకటించిన నష్టం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. దసరా నాటికి పంట నష్టపోయిన రైతులకు ఇస్తామన్న పరిహారం కొందరికే అందింది. జుజ్జులరావుపేట రెవెన్యూ పరిధిలోని గ్రామాల రైతులకు మాత్రమే పరిహారం అందినట్లు రైతులు తెలిపారు. మిగిలిన రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

రెండు పంటలూ లేనట్లే

పాలేరు ఉప్పొంగడంతో పంటలన్నీ దెబ్బతిన్నాయి. వందల ఎకరాలకొద్దీ పొలాల్లో ఇసుక మేట వేసింది. వాటిని తొలగించుకుని హద్దులు సరిచేసుకుని మళ్లీ పంట భూములుగా యదావిధిగా సాగుకు తీసుకవచ్చేందుకు ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదంటూ ఇప్పటికీ రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు. ఇందుకు భారీ ఖర్చు అవుతుందని, అప్పులు చేయాల్సిందేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక నాలుగైదు అడుగుల మేర పేరుకపోయిన ఇసుకమేటలు తొలగించాలంటే ఎకరానికి సుమారు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఒకవేళ్ల ఇచ్చే పదివేల పరిహారం కంటితుడుపుమాత్రమే కానీ.. ఏమూల కూసరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఇసుకమేటలు తొలగించేందుకు చాలా రోజులు పడుతాయని తెలిపారు. ఒకవేళ సారవంతమైన భూమి అంతాపోతుందని, తెలిపారు. దీంతో ప్రస్తుతం వానాకాలంతో పాటు యాసంగిపంట సాగూ కష్టమేనని పేర్కొంటున్నారు. అదేవిధంగా ఇసుకను తొలగించి నాణ్యమైన మట్టిని పోయాల్సి ఉందని, ప్రస్తుతం మట్టికొరత ఉన్నట్లు పేర్కొంటున్నారు. జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవతీసుకుని న్యాయమైన పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. కాగా, పంట నష్టపరిహారం అందరికి అందుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

4.5 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని కూనవరం రోడ్డులో 4.5 కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. మనోజ్, అజారుద్దీన్ అనే వ్యక్తులు ఒడిశా నుంచి ఇల్లెందుకు గంజాయిని ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సీఐ సుంకర రమేష్, హెడ్ కానిస్టేబుళ్లు కరీం, బాలు, సుదీర్, హరీష్, వెంకట్, విజయ్‌కుమార్ ఉన్నారు.

నెల్లిపాక పోస్టాఫీసులో స్వాహాపర్వం

అశ్వాపురం, అక్టోబరు 21: మండల పరిధిలోని నెల్లిపాక బంజరు బ్రాంచ్ పోస్టాఫీస్‌లో స్వాహాపర్వం చోటుచేసుకుంది. ఖాతాదారులు నెలనెలా చెల్లించే ఇన్సూరెన్స్‌పొదుపు,ఫిక్స్‌డ్ డిపాజిట్‌లకు సంబంధించిన సొమ్ము దాదాపు రూ.30లక్షల మేర వారి ఖాతాల్లో జమకాలేదు. బ్రాంచ్ పోస్టుమాస్టర్ చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలపై సారపాక మెయిన్ బ్రాంచ్ అధికారులు విచారణజరుపుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లిపాక బ్రాంచ్ పోస్టాపీస్‌లో సుమారు 200 మంది ఖాతాదారులు నెలనెలా ప్రీమియం,పొదుపు డబ్బులు చెల్లిస్తున్నారు. దీనికి సంబంధించి పోస్టమాస్టర్ వారి పాస్‌పుస్తకాలలో నగదు చెల్లించినట్లు ముద్రవేసి నమ్మించాడు. ఆతర్వాత ఆ సొమ్మును ప్రదాన బ్రాంచ్‌లో జమచేయాల్సి ఉండగా అటువంటిది లేకుండా పోస్టమాస్టర్ చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలున్నాయి.

నెల్లిపాక బంజరు గ్రామానికి చెందిన మంద్రు రాజగోపాలరావు అనే వ్యక్తి తాను పొలం అమ్మిన డబ్బు రూ.6లక్షలు పోస్టాపీస్‌లో జమచేశాడు. ఇటీవల ఆయనకు నగదు అవసరమయి పోస్టాపీస్‌కు వెళ్లి బ్రాంచ్‌మాస్టర్‌కు విషయం తెలుపగా అతడు రేపు, మాపు అంటూ వినియోగదారుడిని తిప్పసాగాడు. దీంతో అనుమానం వచ్చిన సదరు వ్యక్తి సారపాకలోని మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లి ఆరాతీయగా అసలు అతని ఖాతాలో నగదు జమకాలేదని తెలియడంతో లబోదిబోమన్నాడు. ఈ విషయం గ్రామంలో తెలిసి మిగతా ఖాతాదారులు కూడా తమఖాతాలు పరిశీలించుకోగా, పలువురి ఖాతాల్లో నగదు జమకాని విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి సదరు బ్రాంచ్‌మాస్టర్ విధులకు రాకపోవడం,సెల్‌ఫోన్ స్విచ్‌ఆప్‌లో ఉండటంతో అతడే చేతివాటం ప్రదర్శించాడన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది. దీంతో వినియోగదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గిరిజన ఎంపీహెచ్‌డబ్ల్యూ(మహిళలు) శిక్షణ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు అభ్యర్థులు సీహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ.తెలంగాణ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడు చేసుకోవాలని కోరారు. అలాగే రూ.200 ది కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ టీఎస్ హైదరాబాద్ పేరిట డీడీ తీసి, దరఖాస్తుతో ధ్రువీకరణ పత్రాలు జతపర్చి 26వ తేదీలోపు ట్రైనింగ్ స్కూల్లో అందజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 94903 70905, 99633 15325 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చిన రామయ్య

భద్రాచలం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం భక్తులకు ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. అలాగే ఏపీలోని గుంటూరుకు చెందిన భాష్యం లక్ష్మీ ప్రసన్న-రామకృష్ణ దంపతులు దేవస్థానం నిత్యాన్నదాన పథకంకు రూ. లక్ష విరాళంను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి అందజేశారు.



విరాళాన్ని దేవస్థానం ఈవోకు అందజేస్తున్న దాతలు

మద్యం తాగించి.. రాయితో కొట్టి

» చేతబడి అనుమానంతో దారుణ హత్య
» జూలూరుపాడు మండలంలో దారుణం
» సొంత బాబాయిని హతమార్చిన వ్యక్తి
» పోలీసుల అదుపులో నిందితులు



భిక్షం మృతదేహాన్ని పరిశీలిస్తున్న జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి

జూలూరుపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేతబడి నెపంతో ఓ వ్యక్తి సొంత బాబాయినే హత్య చేశాడు. జూలూరుపాడు మండలం రాచబండ్లకోయగూడెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాచబండ్ల కోయగూడెం గ్రామానికి చెందిన కుంజా ప్రవీణ్, మల్కం గంగయ్య(అలియాస్ గంగులు) వరుసకు మామా అల్లుళ్లు. గత కొంతకాలంగా ప్రవీణ్, అతడి తల్లి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. తాను, తన తల్లి అనారోగ్యం పాలు కావడానికి తన బాబాయి కుంజ భిక్షం(42) చేతబడి చేయడమే కారణమని అనుమానించాడు. ఈ క్రమంలో గ్రామంలో ఇటీవల ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం నిర్వహించిన అతడి కర్మకాండల కార్యక్రమంలో ప్రవీణ్, గంగయ్య పాల్గొన్నారు. వీరితో పాటు ప్రవీణ్ బాబాయి కుంజా భిక్షం కూడా పాల్గొన్నాడు. అయితే తాను తన తల్లి అనారోగ్యం పాలు కావడానికి భిక్షమే కారణమని భావించి అతడిని చంపడానికి ప్రవీణ్ తన మామ గంగులుతో కలిసి పథకాన్ని రూపొందించాడు. పథకం ప్రకారం ప్రవీణ్, గంగులు కలిసి భిక్షంను తీసుకొని అదేరోజు రాత్రి మద్యం తాగేందుకు గ్రామ సమీపంలోని వేపల వాగు వద్దకు వెళ్లారు. అక్కడే ముగ్గురూ మద్యం తాగారు. భిక్షం మత్తులోకి జారుకున్న తరువాత మామ, అల్లుళ్లు గంగయ్య, ప్రవీణ్‌లు ఓ రాయితో భిక్షం ముఖం, తలపై కొట్టి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని వాగులో పడవేశారు. ఈ సమయంలో భిక్షం సోదరుడి కుమారుడు నరేంద్ర భిక్షంకు ఫోన్ చేయగా ఆ ఫోన్‌ను గంగయ్య ఎత్తాడు. తాము ముగ్గురం కలిసి వేపలవాగు వద్ద మద్యం తాగుతున్నామని అతడిని కూడా రావాలని కోరాడు. దీంతో నరేంద్ర వారి వద్దకు వెళ్లాడు. అయితే అక్కడ భిక్షం కనిపించకపోవడంతో బాబాయి ఎటువెళ్లాడని నరేంద్ర వారిని ప్రశ్నించాడు. దీంతో భిక్షాన్ని హత్య చేసి వాగులో పడవేశామని, ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని వారు హెచ్చరించారు. దీంతో భయాందోళన చెందిన నరేంద్ర గ్రామానికి వచ్చి విషయాన్ని బంధువులకు, కుటుంబసభ్యులకు తెలియజేశాడు. వారితో కలిసి ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. సోమవారం ఉదయం జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐలు రాణాప్రతాప్, స్వర్ణ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వాగులో నుంచి బయలకి తీయించారు. క్లూస్‌టీం సంఘటన స్థలానికి చేరుకుని ముద్రలను సేకరించారు. మృతదేహాన్ని పోస్‌మార్టం నిమిత్తం కొత్తగూడెం తరలించారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. భిక్షం హత్యకు చేతబడే కారణమా లేక ఇతర కారణాలు ఏమైన ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమార్తెలు కావేరి, కావ్యలు ఉన్నారు.

పిడుగుపాటుకు ఆరు మేకల మృత్యువాత

కామేపల్లి, అక్టోబరు21: ఉరుములు మెరుపులతో పిడుగు పడడంతో ఆరుమేకలు మృతి చెందాయి. మరో మహిళ అస్వస్థతకు గురైంది. ఈ సంఘటన కామేపల్లి మండలం పండితాపురం గలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పండితాపురం గ్రామానికి చెందిన పాటిబండ్ల యశోద అదే గ్రామానికి చెంది మరో వ్యక్తితో కలిసి మేకలు మేపడానికి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో వర్షం పడుతుందని ఓ చింత చెట్టు కింద మేకలతో నిల్చున్నారు. సమీపంలో పిడుగు పడడంతో ఆరు మేకలు అక్కడిక్కడే చనిపోయాయి. యశోద అస్వస్థతతో కింద పడిపోయింది. వెంటనే స్థానికులు చూసి ఆసుపత్రికి తరలించారు.

వాహనదారులకు సోమవారం కష్టాలు

- ప్రజావాణికి వెళ్లిన ఇన్‌చార్జీ డీటీవో
- ప్రతీ సోమవారం వాహనదారులకు తప్పని తిప్పలు
- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పదుల సంఖ్యలో వాహనాల క్యూ



ఖమ్మం సంక్షేమవిభాగం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): నూతనంగా వాహనాలు కొనుగోలు చేసిన వాహనదారులకు త్వరగా నెంబర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని స్వీట్ బాక్స్‌ను తీసుకొని సంతోషంగా ఇంటికి వెళ్లాలని ఉంటుంది. కానీ సోమవారం వచ్చిదంటే జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి వచ్చే వాహనదారులకు ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిరీక్షణ తప్పటం లేదు. పదుల సంఖ్యలో రవాణాశాఖ కార్యాలయంలో వాహనాలను నాల్గు వరసలా బార్లు తీరి నిరీక్షణ చేస్తున్నాయి. రెండు నెలలుగా వరస సెలవులను పొడిగిస్తూ జిల్లా రవాణా అధికారి సెలవ్‌లో కొనసాగుతున్నారు. దీంతో ఖమ్మం మెటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ ఇన్‌చార్జీ డీటీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతీ సోమవారం కలెక్టర్ నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఇన్‌చార్జీ డీటీవో హాజరవుతున్నారు. దీంతో ప్రజావాణి ముగిసే వరకు వాహనదారులు నిరీక్షణ చేస్తున్నారు. మధ్యాహ్నం 3గంటల తర్వాతనే నూతన వాహనాలకు రిజిస్ట్రేషన్, పాత వాహనాలకు ఫిట్‌నెస్, రెన్యూవల్స్ జరుగుతున్నాయి.

ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షల బీమా

- ఏటా రూ.500 చెల్లించాలి
- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు మెరుగైన జీవనం పొందేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన తోడ్పాటు అందించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆటో యూనియన్ నాయకులతో, ఆటోడ్రైవర్ల ఆరోగ్యం, ఇన్సూరెన్స్, అడ్డాల వద్ద సౌకర్యాలు, ఇతర సమస్యలు, అంశాలపై మాట్లాడారు. అక్టోబరు 15న బస్టాండ్ కూడలిలో ఆటో డ్రైవర్లను కలెక్టర్ కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆటో యూనియన్ నాయకులను పిలిచి చర్చిస్తానని ఆ సమయంలో ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆటో అడ్డాల వద్ద అవకాశం ఉన్న చోట కార్పోరేషన్ ద్వారా టాయిలెట్ల నిర్మిస్తామని, వాటి నిర్వహణ బాధ్యతలు యూనియన్లు స్వీకరించాలని తెలిపారు. ఖమ్మంలో ఆటోడ్రైవర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. ఆటోడ్రైవర్లకు రూ.5లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.దీనికోసం డ్రైవర్లు ప్రతీ ఏడాదికి రూ.500 వరకు చెల్లించాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం తరపున ఏలాంటి సంక్షేమ పథకాలు వర్తిస్తాయో వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆటోడ్రైవర్లకు త్వరలో హెల్త్‌క్యాంప్ నిర్వహించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్‌ప్రొఫైల్ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా రవాణాధికారి వెంకట రమణ, వివిధ యూనియన్ల నాయకులు ఎన్. నరేష్ మోహన్, ఉపేందర్, శ్రీను, మోహన్ రావు, పాల్వంచ కృష్ణ, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, యాకూబ్ పాల్గొన్నారు.



రైతు నేస్తం ఫౌండేషన్‌ను సందర్శించిన మంత్రి తుమ్మల

రైతుకు సేంద్రీయమే శ్రీరామరక్ష

- వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల
- గుంటూరులో రైతునేస్తం ఫౌండేషన్ సందర్శన

గుంటూరుసిటీ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): రైతులకు సేంద్రియ పద్ధతులే శ్రీరామ రక్షఅని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన గుంటూరు సమీపంలోని కొర్నేపాడులో రైతునేస్తం ఫౌండేషన్‌ను సందర్శించారు.20 సంవత్స రాలుగా రైతునేస్తం వెంకటేశ్వరరావు చేస్తున్న కృషిని కొనియాడారు. ఇక్కడ కేవలం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వడమే కాకుండా, ప్రకృతిలో లభించే ఆకులు, మూత్రం, ఆవు పేడ ద్వారా ఏవిధంగా ఆర్గానిక్ ఎరువులు, ఆర్గానిక్ పెస్టిసైడ్స్ తయారు చేసుకోవాలో రైతులకు నేర్పించడం గొప్ప విషయ మన్నారు. మల్టీలేయర్ వ్యవసాయ విధానాలు ప్రత్యక్షంగా చూపించడం, పండించిన పంటను యంత్రాల ద్వారా ప్రాసెసింగ్‌చేసి విలువ జోడించే పద్ధతులను తెలియచేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ మార్గాలను చూపించటం ప్రశంసనీయ మన్నారు. ఇక్కడ రైతులు కూడా ఆయిల్ పామ్ పంటలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈసారి పత్తి రైతులకు ఆశాజనకంగా లేదని కేంద్రం ఆధీనంలోని సీసీఐ కూడా కొనుగోలుకు ముందుకు రావడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరి సాంబశివరావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫార్మా కౌన్సిలింగ్ ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): టీజీఎఫ్‌సెట్ 2024 బీఫార్మసీ, ఫార్మాడీ కోర్సులలో చేరే విద్యార్థులకు సోమవారం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. మొత్తం448 మంది విద్యార్థులు స్లాట్ నమోదు చేసుకున్నారు. 415 మంది కౌన్సిలింగ్‌కు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు. మంగళ, బుధవారాల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వస్త్ర వ్యాపారి ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలం కోక్యాతండా గ్రామానికి చెందిన పిల్లి శ్రీలక్ష్మీ రూ.56లక్షలకు ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం దివాలా పిటీషన్ దాఖలు చేశారు. పిల్లి శ్రీలక్ష్మీ ఏడు సంవత్సరాలుగా బట్టల వ్యాపారం చేస్తున్నారు. రుణాలు తీసుకొని వ్యాపారం కొనసాగించారు. వ్యాపారంలో నష్టంరావటం, రుణదాతలు తిరిగి రుణం చెల్లించమని ఒత్తిడి చేయడంతో ఏడుగురుని ప్రతివాదులుగా చేరుస్తూ దివాళా పిటీషన్ దాఖలు చేశారు.

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్
డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225979
కార్గోసేవల నెంబరు: 9154298589

ఖమ్మం పాతబస్టాండ్
డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225965
కార్గోసేవల నెంబరు: 9704345599

సత్తుపల్లి బస్టాండ్
డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225990
కార్గోసేవల నెంబరు: 9154298595

మధిర బస్టాండ్
డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ: 7382925289
కార్గోసేవల నెంబరు: 8143765370

పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి

నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్



నివాళులర్పిస్తున్న పోలీసులు

నేలకొండపల్లి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివని, వెలకట్టలేనివని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ప్రజల ప్రాణాలను రక్షించటంలో, శాంతి,భద్రతనుకాపాడటంలో పోలీసులు ముందుంటారన్నారు.కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్స్ సీతారాములు, హనుమంతు, లక్ష్మీ, కానిస్టేబుల్స్, హోంగార్డ్‌లు పాల్గొన్నారు.

ఏటీసీ కోర్సు అడ్మిషన్లకు గడువు పెంపు

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీఐల్లో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబరు30 వరకు తుదిగడువు అని అదనపు కలెక్టర్ పి.శ్రీజ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభించిందని, జిల్లాలో కళాశాలల్లో ఆరు కోర్సుల్లో మొత్తం 170 సీట్లకు అడ్మిషన్లు ప్రారంభించానట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. సంవత్సర కాల పరిమితి గల కోర్సులు మానుప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్,ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మానుప్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ రెండు సంవత్సరాల కాలపరిమితి గల కోర్సులు బేసిక్స్ డిజైనర్ అండ్ డిజిటల్ మానుప్యాక్చరింగ్,అడ్వాన్స్‌డ్ సీయన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ మెహికల్ కోర్సులలో సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు9100852344, 7095739332 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఖమ్మంరూరల్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై రూరల్‌పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసునమోదు అయింది. పోలీసుల వివరాల ప్రకారం.. కల్లూరు మండలం, చిన్నకోరుకొండ శివారు కృష్టారం గ్రామానికి చెందిన వి.వెంకటేశ్వరరావు (20) ద్విచక్రవాహనంపై ఆదివారం మహబూబాబాద్‌లోని స్నేహితుల ఇంటికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో రూరల్ మండలం, కాచిరాజు గూడెం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టాడు. దీంతో వెంకటేశ్వరరావు తీవ్రగాయాలపాలైయ్యాడు. స్థానికులు ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం పోలీసులు కేసునమోదు చేశారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు హార్వెస్ట్, సర్వజ్ఞ విద్యార్థులు





విద్యార్థులను అభినందిస్తున్న హార్వెస్టు, సర్వజ్ఞ పాఠశాల యాజమాన్యం

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్- 14, 17 చెస్, బాస్కెట్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైయ్యారని పాఠశాల యజమాన్యం తెలిపింది. ఇటీవల నగరంలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చూపి ఎంపికైనట్లు వారు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్,ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, అభినందించారు. రాష్ట్ర పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియ వారు కొత్తగూడెంలో ఇటీవల నిర్వహించిన అండర్ 17 ఫుట్‌బాల్, అండర్ 17, 14 టేబుల్ టెన్నీస్ పోటీల్లో సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ఆర్ నాగేంద్రకుమార్ తెలిపారు. పుట్‌బాల్‌లో బి మహిందర్, ఆర్‌పి ధ్రువ రాజ్, మోక్షగ్న్యతనిస్ , అండర్ 17, 14 టేబుల్ టెన్నీస్‌లో ఆర్ చార్విక్, ఎస్‌కె పజ్జిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ 2న జమ్ముకాశ్మీర్‌లో జరిగే అండర్ 17పుట్‌బాల్ పోటీలలో బి మహిందర్ ఎంపికైనట్లు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని పాఠశాల డైరెక్టర్స్ ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమ అభినందించారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు

దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటరు నమోదు, దరఖాస్తుల విచారణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై కలెక్టర్‌తో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు వస్తున్న దరఖాస్తుల విచారణ మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని అన్నారు. దీని కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులు నియమించాలని అన్నారు. ఓటర్ల నమోదుతో పాటు దివ్యాంగులు, థర్డ్ జెండర్, సెక్స్ వర్కర్ మొదలగు వర్గాలు, ఆదివాసీ, గిరిజనుల ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అన్నారు.

24న నేలకొండపల్లి సీపీఎం మండల సభ

నేలకొండపల్లి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఈ నెల24న మూటాపురంలో సీపీఎం 9వ మండల మహాసభను నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయకుడు, మండల ఇన్‌చార్జి గుడవర్తి నాగేశ్వరరావు చెప్పారు. మండల మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఎం శ్రేణులు సోమవారం మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మూటాపురం గ్రామంలో గుడవర్తి మాట్లాడుతూ నూతన కమిటీ ఎన్నికతో పాటుగా రానున్న మూడు సంవత్సరాలు పార్టీ నిర్వహించనున్న ఉద్యమ కార్యాచరణను రూపొందాస్తామన్నారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, జోన్ బాధ్యుడు పగిడికత్తుల నాగేశ్వరరావు, శాఖా కార్యదర్శి ఏలూరి రామారావు నాయకులు ఏలూరి రంగారావు, రచ్చా నర్సింహారావు, రాసాల కనకయ్య,గుగులోతు వీరూ నాయక్, ఇంటూరి అశోక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని గువ్వలగూడెం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంటకు చెందిన జే.లింగరాజు, జే.వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళుతుండగా, ఖమ్మంవైపు నుంచి నేలకొండపల్లి వైపు వెళుతున్న గుర్తు తెలియని ఆటో వీరి వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రగాయాలతో రోడ్డుపై పడిఉన్న లింగరాజు, వెంకటేశ్వర్లును స్థానికులు సమాచారం మేరకు 108లో ఖమ్మం తరలించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేస్తున్న వద్దిరాజు

ఖమ్మంటౌన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): తన సిఫారసుతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సోమవారం నగరంలోని బుర్హాన్‌పురంలోని క్యాంప్ కార్యాలయంలో బాధితులకు అందచేశారు. వివిధ రకాల అనారోగ్యాలతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న 8మందికి సీఎంఆర్‌ఎఫ్‌కు సిఫారసు చేశారు. నిధులు మంజూరు కాగా సోమవారం బాధితులకు చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ తోట రామారావు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

కొత్తగూడెం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన నగరానికి చెందిన దీప్తిని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సోమవారం క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు.నగరంలోని బొక్కలగడ్డకు చెందిన హమాలీ పనిచేసే వేంకటేశ్వర్లు-మంగ కుమార్తె దీప్తి 10వతరగతి, ఇంటర్‌మీడియట్‌లో మంచి మార్కులు సాధించింది. అనంతరం ఎంబీబీఎస్ సీటు పొందింది. వైద్య విద్యార్థిని దీప్తిని సన్మానించిన వద్దిరాజు మాట్లాడుతూ క్రమశిక్షణ, ధృఢసంకల్పం ఉంటే పేదరికం అడ్డురాదని దీప్తి నిరూపించిందని ప్రశంసించారు.

రేపు ఎక్సైజ్ వాహనాల వేలం

ఖమ్మం సంక్షేమ విభాగం,అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): పలు ఎక్సైజ్ నేరాల కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం ద్వారా అమ్మకాలు జరిపేందుకు నిర్ణయించటం జరిగిందని ఖమ్మం రెండో పట్టణ ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ సోమవారం ప్రకటించారు. ఈనెల 23న ఖమ్మం ఒకటోవ పట్టణ ఎక్సైజ్‌స్టేషన్ వెనుకబాగంలో ఉదయం 11గంటలకు వేలం ప్రక్రియ నిర్వహిస్తున్నామని ప్రకటించారు.

సౌత్‌జోన్‌అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్అక్టోబరు21: ఇటీవల గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో జరిగిన 35వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు.సర్ధార్ పటేల్ స్టేడియంలోని నిత్యం సాధన చేసే క్రీడాకారులు గోపీచంద్ రెండు రజత పతకాలు సాధించగా మస్తాన్‌రెండు రజతాలు, వైశాలి రెండు స్వర్ణ పతకాలు, ఆఫ్రీన్ కాంస్య పతకం సాధించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి షఫీక్ అహ్మద్ అభినందించారు. భవిష్యత్ పోటీల్లో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

పేదల ఇళ్లు కూల్చివేతలపై ఆలోచించాలి

కేఎంసీ కమిషనర్‌కు కాంగ్రెస్, సీపీఎం నాయకుల వినతి

ఖమ్మం సంక్షేమ విభాగం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల కూల్చివేతలో ప్రభుత్వశాఖల అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచన చేసి నిర్ణయాలు తీసుకోవాలని కార్పొరేటర్ కొప్పెర సరిత ఉపేందర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ కోరారు. 34వ డివిజన్‌లో పేదల ఇళ్ల కూల్చి వేతకు అధికారులు నిర్ణయించారు. వారి ఇళ్ల వద్దకు జేసీబీలతో వెళ్లటంతో ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో సమస్యను శాంతియుతంగా పరిష్కారం చేయాలని కాంగ్రెస్, సీపీఎం నాయకులు కేఎంసీలో జరుగుతున్న ప్రజావాణిలో కమిషనర్ అభిషేక్‌అగస్త్యను కలిసి సమస్యను వివరించారు. మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. నాయకులు తాళ్లూరి హనుమంతరావు, రుద్రగాని ఉపేందర్, తోట వీరభద్రం, నూనె శశిధర్, యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ స్పందించారు. సోమవారం వచ్చిన ఫిర్యాదులు వారం రోజుల్లోగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

రాధమ్మకు ఎమ్మెల్యే కూనంనేని నివాళి

ఖమ్మంరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద తండా గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ కిసాన్ శ్రీను తల్లి రాధమ్మ (95) ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం వారి ఇంటికి వెళ్లి రాధమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత ముత్తయ్యకు నివాళులు

తిరుమలాయపాలెం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు రేఖ ముత్తయ్యకు వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. ముత్తయ్య ఇటీవల మృతి చెందగా సోమవారం దశదినకర్మ నిర్వహించారు. ముత్తయ్య చిత్ర పటానికి ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి,మాజీమంత్రి సంబాని చంద్రశేఖర్ నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయ కులు చావా శివరామకృష్ణ, ఎండీ ముస్తాఫా, మండల అధ్యక్షుడు బెల్లం శ్రీను, రామసహాయం అరవిందరెడ్డి, పోట్ల కిరణ్, ఉపేందర్ నివాళులర్పించారు.

పలు కుటుంబాలకు ఎంపీ పరామర్శ

తల్లాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో సోమవారం ఖమ్మం ఎంపీ ఆర్.రఘురామిరెడ్డి పర్యటించారు. మండలంలోని రామానుజవరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన శీలం నాగిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగిరెడ్డి కుమారులు మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి, అంజిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మిట్టపల్లి గ్రామంలో మృతిచెందిన జంగం నారాయణమ్మ కుటుంబాన్ని కూడా ఆయన పరా పరామర్శించారు. సొసైటీ ఛైర్మన్ తూము వీరభద్రరావు, నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, పాసంగులపాటి లక్ష్మీనారాయణ, కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), దుండేటి కేశవరెడ్డి, పోట్రు శ్రీనివాసరావు, పిల్లి కృష్ణ, తూము వెంకటనారాయణ, అనుమోలు బుద్దీసాగర్ పాల్గొన్నారు.

'ప్రశ్నాపత్రాలను లీకేజీ చేయొద్దు'

సత్తుపల్లిరూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పరీక్షలను ముందుగానే నిర్వహించవద్దని, ప్రశ్నాపత్రాలను సోషల్ మీడియా, వాట్సప్‌ల ద్వారా ఇతరులకు లీకేజీ చేయొద్దని ఎంఈవో నక్కా రాజేశ్వరరావు సూచించారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలలో నిర్వహిస్తున్న ఎస్ఏ-1 పరీక్షా కేంద్రాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్ణీత సమయాలలో మాత్రమే పరీక్షలు నిర్వహించాలని, టైంటేబుల్ పాటించాలని హెచ్ఎంలు, యాజమాన్యాలకు సూచించారు. నిబంధనలకు మీరిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

క్షయవ్యాధిపై అవగాహన ఉండాలి

తల్లాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి ఐ.రత్నమనోహర్ సూచించారు. సోమవారం తల్లాడ మండలం అన్నారుగూడెం ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరంలో క్షయవ్యాధిపై నిర్వ హించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీబీ చికిత్స సూపర్‌వైజర్ వై.సురేష్, ల్యాబ్ సూపర్‌వైజర్ ఆర్.సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు సిరిపురం విద్యార్థిని

మధిరరూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో సోమవారం జరిగిన ఖోఖో పోటీలలో మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన చైతన్యరెడ్డి అనే విద్యార్థిని ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీఈటీ వై.కోటి తెలిపారు. అండర్ 17 సీనియర్స్ బాలికల విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

విరాళం అందజేత

పెనుబల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి కోదండ రామాలయం అభివృద్ధికి గ్రామానికి చెందిన బుస్కా నర్సింహారావు, కృష్ణవేని దంపతులు సోమవారం రూ.10వేలను విరాళంగా అందజేశారు. కోదండ రామాలయంలోని ఆంజనేయస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు ఆలయ కమిటీ నిర్వాహకుడు చిట్లూరి సత్యనారాయణ, ఆలయ అర్చకుడు శ్రీరంగం శ్రీనివాసాచార్యులకు అందజేశారు.

ఆసుపత్రికి బెడ్ వితరణ

పెనుబల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అడవిమల్లెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల కోసం బెడ్‌ను ఎడ్లబంజర్‌కు చెందిన అశోక్ కన్నా అందజేశారు. ఎడ్లబంజర గ్రామానికి చెందిన ఎడ్ల హర్షిత తన తల్లి పద్మశ్రీ జ్ఞాపకార్థం అడవిమల్లెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.20 వేల విలువైన బెడ్‌ను మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రజలకు ఉపయోగపడే బెడ్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. దాత హర్షిత కుటుంబసభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, ఎడ్ల వెంకటేశ్వరరావు, ఎడ్ల నర్సింహారావు, భద్రయ్య, సాయి, ఎడ్ల సుమంత్, రామిశెట్టి మనోహర్‌నాయుడు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, బషీరుద్దీన్, పోలమ్మ, పాషా పాల్గొన్నారు.

వర్షాలతో అన్నదాతల పరేషాన్

» పనలు తడిసి కుళ్లి పోతున్న వరి కంకులు » ఇప్పటికే సుమారు 1000 ఎకరాల్లో నేల వాలిన పైరు



కల్లూరులో నేల వాలిన వరి పైరును చూపిస్తున్న రైతు

కల్లూరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) తుపాన్‌ల ప్రభావంతో ఆకస్మాత్తుగా ఆదివారం కల్లూరు పరిసర గ్రామాల్లో గాలి, వానతో ఈ వానకాల సీజన్‌లో సాగు చేసిన వరి పక్వానికి రాగా త్వరలో వరి కోతలకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో వరి పైరు ఇప్పటికే నేల వాలింది. దీంతో వరి పొలాల్లో నీరు చేరటంతో కోతకు వచ్చిన (పక్వానికి) వరి నేలవాలగా వరి పనకలు నీటి మునిగి తడిసి కంకులు కుళ్లి మొలకలు వచ్చాయి. దీంతో ఈ ప్రాంతానికి చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని యర్రబోయినపల్లి, చం ద్రుపట్ల గ్రామాల్లోనే సుమారు 800 ఎకరాల్లో వరి పైరు తీవ్రంగా నష్టం జరిగింది. సాగర్ జ లాల రాకతో కల్లూరు మండలంలో 33 వేలకు పైగా ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ వానాకాల సీజన్ వరి సాగు రైతుకు కత్తి మీద సా ములా మారింది. అసలే సెప్టెంబరు మాసంలో తుఫాన్‌ల బెడదతో వరి సాగు చేసిన రైతులు కొంత మేరకు నష్ట పోగా, అ పై వరి పైరు దిగుబడికి వస్తున్న సమయంలో తుఫాన్‌ల ప్రభాంతో గాలి, వానాలతో కోతకు వచ్చిన వరి నేల వాలి రైతులకు మరింతగా నష్టం వాటిల్లుతున్నందున రైతులు దిగాలు పడ్డారు. వరి నేల వాలడంతో పనలు(వరి కంకులు) తడిసి ఎకరానికి సగటున 7 బస్తాల ధాన్యం తరుగు వచ్చే పరిస్థితి నెలకోన్నదని రైతులు వాపోతున్నారు. రైతులు తమ పంటను ఇంటికి చేర్చే విషయంలో ఈ వరి కోతల సీజన్‌లో దిన దిన గండంగా గడుపుతున్నారు. నేల వాలిన వరిపైరును నష్టాభారీన పడకుం డా కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వరి కోతలకు నవంబరు నెల కీలకమైనది. ఈ మాసాంతం తుఫాన్‌లు సోకపోతే దిగుబడి అయిన వరి సవ్యంగా ఇంటికి చేరే అవకాశం ఉంది.

పొలాల్లో నీటిని బయటకు పంపాలి: ఏవో రూప

వరి పోలాల్లో చేరిన నీటిని బయటకు తరలించాలి. వరి పనలను పాయలుగా చేసి కాల్వల ద్వారా నీటిని బయటకు తరలిస్తే కంకులు తడిసే ఆవకాశం ఉండదు. నేల వాలిన వరి పనకులను లేపి జడలుగా కట్టాలని రైతులకు సూచించారు. ఈ పద్ధతులను పాటిస్తే రైతులు నష్టపోకుండా ఉంటారు.

'సమాజాన్ని కాపాడేందుకు సిద్ధంగా ఉండాలి'



నివాళులర్పిస్తున్న కమాండెంట్ పీజేపీసీ.ఛటర్జీ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): సంఘ విద్రోహాలను ఎదుర్కొనేందుకు, వారి నుంచి సమాజాన్ని కాపాడేందుకు పోలీసులు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ.చటర్జీ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అశువులుబాసిన వారికి స్మృతి పరేడ్ వద్ద పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ.రంగారెడ్డి, ఆఫీసర్స్, కానిస్టేబుల్ ఆఫీసర్స్, హోంగార్డ్స్, ఎస్‌సీటీ పీఎస్‌లు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

● ఏసీపీ రెహమాన్

మధిరటౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని వైరా ఏసీపీ రెహమాన్ సూచించారు. సోమవారం ఆయన వార్షిక తనిఖీలలో బాగంగా మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేసారు. పెండింగ్‌లో ఉన్న చోరీ కేసులతో పాటు ఐటీ కేసులు ఇతర కేసుల స్థితిగతులను ఎస్.ఐ సంధ్యను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని అన్ని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి పని తీరును ఎప్పటికీ అప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ తాగునీటి సహాయకులకు శిక్షణ

కల్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ముచ్చవరం గ్రామంలో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా పలు అంశాలపై గ్రామ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయలక్ష్మి పలు అంశాలపై అవగాహన కల్పించారు. తొలి రోజున జరిగిన ఈ శిక్షణలో మోటారు పంపుసెట్టు మరమ్మతుల గురించి వివరించారు. ఇలా నాలుగు రోజుల పాటుగా మంచినీటి పథకాల ద్వారా నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండ ఉండేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో తాగు నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు కావల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలి

● తహసీల్దార్ రాజు



ప్రజావాణిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

వేంసూరు, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) కుల, ఆదాయ తదితర ధ్రువ పత్రాలు కావల్సిన వారు పదిరోజులకు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎంఏ.రాజు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేంసూరులో స్వైరవిహారం చేస్తున్న కోతులను నివారించాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఏవో రామ్మోహన్‌రావు, ఎంపీవో రంజిత్‌కుమార్, ఎంఈవో సీహెచ్.వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భవాని, కమల, వసంత, అధికారులు పాల్గొన్నారు.

ఎరువులను తక్కువ మోతాదులో వినియోగించాలి

ఏన్కూరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఎరువులను తక్కువ మోతాదులో వినియోగించాలని కృషివిజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తూతక్కలింగన్నపేట గ్రామంలోని వరి పంటలను పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిపించారు. వరిపొలాల్లో బాక్టీరియా ఎండాకు తెగులు లక్షణాలు ఉంటే వెంటనే నత్రజని ఎరువులను వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏవో నరసింహారావు, ఏఈవోలు శ్రీకాంత్, బాలకృష్ణ, అశోక్, రైతులు కోలేటి వెంకటేశ్వర్లు, మండెపుడి వెంకయ్య, పాశం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేయండి'



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న ప్రయాణికుల సంఘం నాయకులు

ఎర్రుపాలెం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రాష్ట్ర ప్రయాణీకుల సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి హనుమంతరావు ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో తన నివాసంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఎర్రుపాలెం నుంచి రైల్వే సేవలను ప్రయాణీకులు వినియోగించుకుంటున్నారని, సరైన వసతులు సౌకర్యాలు లేకపోవడంతో ఏళ్ల నుంచి ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 26 ఏళ్ల క్రితం మధిరలో శాతవాహన ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు కిషన్‌రెడ్డి కృషిని ఆయనకు గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో పాటిబండ్ల లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి, రామిరెడ్డి, అన్వర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల సాధన కోసం ఉద్యమిద్దాం

» ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్

కల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) గిరిజన హక్కుల సాధన కోసం ప్రభుత్వంతో పోరాడేందుకు ఉద్యమిద్దామని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ గిరిజన ప్రజలకు పిలుపు నిచ్చారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు ధర్మసోతు ధశరధ్‌నాయక్ అధ్యక్షతన కల్లూరులో జరిగిన లంబాడి హక్కుల పోరాట సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్టీలలో గెలిచిన లంబాడి సామాజిక వర్గానికి ప్రభుత్వ మంత్రి వర్గంలో భాగస్వామ్యం కలిపించాలని డిమాండ్ చేశారు. ప్రతి తండా, గూడెం గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మైదాన ప్రాంతాలలో ఐటీడీఏలను, ఏజన్సీ ప్రాంతాల్లో 100 శాతం ఏజన్సీ చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్టీ కార్పొరేషన్, ట్రైకార్ రుణాలను మంజూరు చేయాలని కోరారు. వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అణుగుణంగా మెస్‌చార్జీలు సగటున రూ.100 పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నంగరభేరి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణానాయక్, గుగులోతు కేశవనాయక్, నందునాయక్, లకావత్ నాగేశ్వరరావు, భూక్యా రవినాయక్, జానకిరామ్‌నాయక్, సాయిరాంనాయక్, శివనాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని భవనాన్ని తొలగించాలని కౌన్సిలర్ ధర్నా



అనుమతి లేదంటూ ఓ భవనం ముందు ధర్నా చేస్తున్న కౌన్సిలర్ కర్నాటి నందిని

వైరా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 4వ వార్డు పరిధిలోగల సాయి నిలయం చింతన్న కాంప్లెక్స్‌కు అనుమతులు లేవని దానిని వెంటనే తొలగించాలని డి మాండ్ చేస్తూ పదోవార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని ఆధ్వర్యంలో సోమ వారం ధర్నా నిర్వహించారు. ఆభవనం ముందు బైఠాయించి ఈ ఆందోళన చేశారు. ప్రభుత్వ స్థలాల్లో మునిసిపాలిటీ అనుమతులు లేకుండా ఈ భవనాన్ని నిర్మించారని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఆసమయంలో ఆభవనానికి చెందిన దొంతెబోయిన చింతయ్య ఆయన కుటుంబ సభ్యులకు కౌన్సిలర్‌కి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం చింతయ్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఏదైనా సమస్య ఉంటే మునిసిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, అందుకు విరుద్ధంగా ధర్నా చేయడం సరికాదని, వెంటనే విరమించుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం కౌన్సిలర్ అక్రమంగా వేసిన లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ చింతా వేణుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కర్నాటి హన్మంతరావు, షేక్.సైదులు, నర్సింహారావు దావీదు, రామారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శోభనాచలం కళాశాలను అభివృద్ధి చేస్తా

» కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్

సత్తుపల్లి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): బండి శోభనాచలం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థిగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. స్థానిక బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ దారా ప్రమీల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు వితరణగా అందజేసిన యూనిఫామ్‌ను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇదే కళాశాలలో చదువుకున్నానని, కళాశాలకు నూతన భవనాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించి వచ్చే విద్యాసంవత్సరానికి ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా కళాశాలలో మెరిట్ సాధించే విద్యార్థులకు ఏటా నగదు ప్రోత్సహకాలు అందించేందుకు గానూ తాను రూ.లక్ష నగదు విరాళంగా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎస్.వెంకటేశ్వరరావు, బీ.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి: సూరంపల్లి



ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను సన్మానిస్తున్న సూరంపల్లి రామారావు

కొణిజర్ల, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు అన్నారు. సోమవారం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సూరంపల్లి మాట్లాడుతూ పంచాయతీరాజ్ నిధులు రూ. 5కోట్లతో మండల కేంద్రం కొణిజర్ల నుంచి పొగాకుజాలు రోడ్డు తనికెళ్ల వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు పొడవున బీటీ రోడ్డు మంజూరు అయిందని, ఎమ్మెల్యే కృషితోనే రోడ్డు మంజూరు అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, కొలిపాక వెంకటేశ్వర్లు, రేపాలవెంకటి తదితరులున్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్న మౌలాలి

కల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఎండి మౌలాలి ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో బిర్ల ప్లానిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శారద ఎడ్యూకేషన్ ట్రస్టు సభ్యులు ఈ అవార్డును ఆయన అందజేశారు. గత 18 సంవత్సరాల నుంచి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తూ జ్ఞానం, శాస్త్రీయత, సమతూలం వైపు, శ్రమ పట్ల గౌరవం వైపు నడిపించటమేకాక, విద్యార్థుల హృదయాల్లో కూతుహలం, వారి కలలను ఆలోచనలకు అనుగుణంగా భోధన చేస్తూ విద్యారంగంలో వారిని ముందుకు తీసుకోవెళ్తున్నారు. ఉపాధ్యాయ వృత్తి విద్యార్థుల తరాల జీవితాన్ని మార్చే విధంగా భోదన చేస్తున్నందుకు ఆయన సేవలను గుర్తించి శారద ఎడ్యూకేషన్ వారు ఈ అవార్డును అందజేశారు. ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ కమల మనోహర్ చేతుల మీదుగా మౌలాలికి ఈ అవార్డును అందజేశారు.



ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు మౌలాలి

అర్హులందరికీ నష్ట పరిహారం ఇవ్వాలి

» సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

మధిరరూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు బండి రమేష్ తెలిపారు. మధిరలోని బోడేపుడి భవన్ నందు సోమవారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాలతో రైతులు తీవ్రం గా నష్టపోయారన్నారు.. ఈసమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి మంద సైదు లు, జిల్లా కమిటీ సభ్యుడు శీల నరసింహారావు, మధు, శ్రీరాములు, వీరాచారి, వెంకాయమ్మ, సాహెబ్, వెంకటనరసయ్య పాల్గొన్నారు.

బోనకల్: అర్హులైన తమకు పంట నష్ట పరిహారం అందించాలని సోమవారం స్థానిక రైతు వేదిక వద్ద బోనకల్ గ్రామానికి చెందిన రైతులు ఆందోళన నిర్వహించారు. అకాల వర్షాలకు తాము సాగు చేసిన పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడీఏ విజయ చంద్ర రైతులకు సర్ది చెప్పినా వినకపోవడంతో సమస్యను జేడీఏ దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళన చేసిన రైతుల వద్ద నుంచి భూముల వివరాలు, ఆధార్ కార్డులను తీసుకున్నారు. న్యాయం జరిగేలా తమ వంతుగా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని రావినూతల గ్రామంలో ఎరువుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో నాగేశ్వరావు పాల్గొన్నారు.

వైరా మునిసిపాలిటీలో అవినీతిపై సమగ్ర విచారణ చేయాలి

» మునిసిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం, బీఆర్ఎస్ నాయకుల నిరసన



నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ వేణు

వైరా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలో ఎలాంటి పనులు చేయకుండానే అక్రమ బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సీపీఎం, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అధికార పార్టీ నేతలు అధికారులను బెదిరించి అక్రమ పద్ధతుల్లో బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని దోచుకోనేందుకు ప్రయత్నిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ పదోవార్డు గండగలపాడులో అక్రమ బిల్లులతో ప్రజాధనాన్ని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలపై ఇంటిపన్నుల భారం వేసి అభివృద్ధి నిధుల నుంచి పనులు చేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానం ద్వారా చేస్తున్న పనులకు సంబంధించి నిధులు కాజేసేందుకు మునిసిపల్ కార్యాలయంలో చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ ఆందోళన చేశారు. మునిసిపాలిటీ పరిధిలో అనేక రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిపివేసి వాటికి బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని ఏవిధంగా దోచుకుంటారని మునిసిపల్ కమిషనర్ చింతా వేణును ప్రశ్నించారు. అక్రమ బిల్లుల చెల్లింపులను నిలిపివేయాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, నాయకులు మల్లెంపాటి రామారావు, ఇమ్మడి సుధీర్, గుమ్మా నర్సింహారావు, కొంగర సుధాకర్, కామినేని రవి, సాంబశివరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, గోపి పాల్గొన్నారు.